RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 05 జూలై 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:32

# మిడ్జిల్ మండలానికి నా ప్రాణమిచ్చినా తక్కువే

## పాలమూరును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది రేవంత్ రెడ్డి



"గడిచిన 20 ఏళ్లలో ఏనాడూ సెలవు తీసుకోలేదు. వచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేయలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించే గొంతునై ప్రజా సమస్యల పరిష్కారం కోసం కొట్లాడాను. అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధిని, అభివృద్ధితో పాటు దీర్ఘకాలికంగా పట్టిపీడిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేశా.." అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు.

20 ఏళ్ల రాజకీయ ప్రస్థానం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు జూపల్లి కృష్ణారావు , వాకిటి శ్రీహరి తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. మిడ్జిల్‌ను అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ మండలంలోని ప్రతి గ్రామానికి అభివృద్ధి చేరాలి. అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మండలాన్ని దత్తత తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ని కోరారు.

"ఇక్కడ ప్రజలు నాకు సర్వం ఇచ్చారు. నన్ను పెంచి పోషించారు. ఆనాడు మొక్కనాటిన మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చెందిన మండలంగా తీర్చిదిద్దే బాధ్యత నాపై ఉంది. కరవుతో అల్లాడుతున్న డార్క్ ఏరియా కాదు. వెలుగు నిండిన మండలంగా ప్రభుత్వ రికార్డుల్లో రావాలి" అని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

"జులై 4, 2026 నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మీద మిడ్జిల్ ప్రజలు ఒక చరిత్రను లిఖించిన రోజు. జెడ్పీటీసీగా గెలుపు నాది కాదు. ఈ మిడ్జిల్ మండల ప్రజలది. నిజాం సర్కార్ నుండి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఈ జిల్లా బిడ్డ బూర్గుల రామకృష్ణారావు గారు ముఖ్యమంత్రిగా పని చేశారు" అని గుర్తుచేశారు.

"ఉత్తమ పార్లమెంటేరియన్ గా గౌరవించబడిన కీర్తిశేషులు జైపాల్ రెడ్డి ఆయన ఎదుగుదలను తన చేతుల మీదుగా నడిపించిన ద్యాప గోపాల్ రెడ్డి గుడియాన్ పల్లి వాసి. మహేంద్రనాథ్ ఈ ప్రాంతం నుండి ఆదర్శంగా నిలబడిన గొప్ప నాయకుడు అని స్మరించుకున్నారు. యాప గోపాల్ రెడ్డి తో పాటు, రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం" అని చెప్పారు.

"జెడ్పీటీసీగా నాతో పాటు పని చేసిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు తెలుసు. ఆనాడు చాలా గ్రామాలకు రోడ్లు లేవు. అభివృద్ధి లేదు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మిడ్జిల్ మండలాన్ని, అదే విధంగా గద్వాల్ శాసనసభ నియోజకవర్గంలోని గట్టు మండలాన్ని డార్క్ ఏరియాలుగా ప్రకటించారు. విద్య, వైద్యం, సాగు, తాగు నీరు.. ఎలాంటి సౌకర్యాలు లేని అత్యంత వెనుకబడిన మండలాలుగా ప్రకటించారు" అని ఆనాటి పరిస్థితులను వివరించారు.

"అత్యంత వెనుకబడిన ఈ మండల ప్రజలు 2006లో తీసుకున్న నిర్ణయంతో ఈనాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాకు వచ్చింది. ఈరోజు ఈ మండలానికి కృతజ్ఞత చెల్లించాల్సిన బాధ్యత నా మీద ఉంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

"40 ఏళ్లుగా నానుతున్న ఎస్సీ ఉప కులాల వర్గీకరణ పరిష్కరించాం. వందేళ్లుగా జరగని వెనుకబడిన తరగతుల కులగణన చేశాం. లెక్క తేల్చడమే కాకుండా వారి వాటా వారికి ఇవ్వాలని సమస్యకు పరిష్కారం చూపించాం. ముఖ్యమంత్రి గా అవకాశం ఇచ్చినందుకే ఈ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకోగలిగాం" అని వివరించారు.

"నేను పుట్టింది గ్రామంలో. గ్రామంలో అన్ని కులాలు, మతాలు, అన్ని సమస్యలను, పేదవాడి కష్టాలను చూసుకుంటూనే నేను పెరిగాను. వ్యవసాయం తెలుసు. దుక్కి దున్నడం తెలుసు. విత్తనం వేయడం తెలుసు. భూమికి, విత్తనానికి ఉన్న బంధమేంటో, పేదవాడికి, పరిపాలన చేసే వాడికి ఉండవలసిన అవగాహన ఏందో తెలుసు" అని పేర్కొన్నారు.

"రాష్ట్రమంటే, దేశమంటే ఎక్కడో లేదు. 12 వేలపైచిలుకు గ్రామపంచాయతీలు కలిస్తేనే తెలంగాణ రాష్ట్రం. 6 లక్షలకుపైగా గ్రామాలు కలిస్తేనే భారతదేశం. గ్రామంలో సమస్యలు పరిష్కారమైతేనే మండలం, జిల్లా, రాష్ట్రం.. వరుసగా అభివృద్ధి సాధిస్తాయి. ఆ విధంగా అన్ని రాష్ట్రాల్లోని సమస్యలు పరిష్కారమైతే దేశం అభివృద్ధి చెందినట్టే" అని అన్నారు.

"మిడ్జిల్ మండలానికి ఏమిచ్చినా, చివరికి నా ప్రాణమిచ్చినా తక్కువే. వలసల పాలమూరును అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది" అని చెప్పారు.




# అభివృద్ధి కార్యాక్రమాల్లో వేగం పెంచాలి

**క్యూర్ పరిధిలో అర్బన్ హౌసింగ్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**
**రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు ఆధునిక శాశ్వత భవనాలు**
**ప్రభుత్వ ప్రాధాన్యతల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
**అధికార యంత్రాంగానికి మంత్రి పొంగులేటి దిశానిర్దేశం**



హైదరాబాద్ :- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో వేగం పెంచాలని , ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలో అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ స్కీమ్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణంపై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.



ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ "గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్న సంకల్పంతో గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతమైంది. ఇది దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇదే స్ఫూర్తిని క్యూర్ పరిధిలో చేపట్టబోయే అఫర్డబుల్ ఎల్ఐజి అర్బన్ హౌసింగ్ పై కూడా చూపించాలి. క్యూర్ పరిధిలో పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలో ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆలోచనల మేరకు రెవెన్యూ , హౌసింగ్ విభాగాల అధికారులు సమిష్టిగా సమన్వయంతో పనిచేయాలి.

వీలైనంత త్వరితగతిన పేదలకు ఇళ్లు అందించే విధంగా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే ఖరారైన స్థలాలలో పొజిషన్ తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన కార్యాచరణను వేగవంతంగా రూపొందించాలి. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించి తక్షణమే ఖరారు చేయాలి. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాలకు గాను ప్రతి నియోజకవర్గంలో తొలి విడతలో 500 ఇళ్లు నిర్మిస్తున్నాం. ఈ ఇళ్లకు సంబంధించి టెండర్లను వీలైనంత త్వరలో ఖరారు చేస్తాం.

రాష్ట్ర వ్యాప్తంగా పది ఆర్డీవో, 107 తహశీల్దార్, స్టాంప్స్ ఢ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రెండు డిఐజి , నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తున్నాం. ఈ భవనాలన్నీ ఒకే డిజైన్‌లో ఉంటాయిఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సదుపాయాలతో, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మిస్తున్నాం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో సోలార్ పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తాం" అని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఈ సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి వి.పి. గౌతమ్, స్టాంప్స్ ఢ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతపై సిఎస్ శ్రీ సంజయ్ జాజూ సమీక్ష



హైదరాబాద్, జూలై 4: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజారోగ్య పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆహార భద్రతా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని, కల్తీ ఆహార పదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం సిఎస్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్ కంట్రోలర్ విభాగం, ఫుడ్ సేఫ్టీ విభాగాలు సమన్వయంతో పని చేస్తూ రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల అమలు, నాణ్యతలపై నిరంతరం తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న రెండు విభాగాలను ఏకతాటిపై నడిపేందుకు తగిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సిద్ధం చేయాలని సిఎస్ సూచించారు. దీంతో ఆయా విభాగాలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధానాన్ని అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా తగిన విధంగా అమలు చేసేందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసులు, వాటి పురోగతి, సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు, ఎక్స్-అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి సి.వి.ఆనంద్, సిఎంఒ ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, ఎన్.శ్రీధర్, జిఎడి ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీం, అడిషనల్ డిజి(ఇంటెలిజెన్స్) విజయ్ కుమార్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా చొంగ్తూ, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, వైద్యశాఖ కమిషనర్ సంగీతా, డ్రగ్ కంట్రోలర్ డిజి అవినాష్ మొహంతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

05 జూలై 2026 ఆదివారం

# కాళ్ల బేరానికి పాకిస్తాన్

అనధికార సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. కానీ ఒక్కసారిగా పాక్ భారత్‌ల మధ్య ఒక సంవత్సర కాలంలో 6 సార్లు ఈ సమావేశాలు జరగడం, భారత తరఫున మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద నరవానే, మాజీ దౌత్యవేత్త రుచి ఘనశ్యామ్, బిజెపి నాయకులు రామ్‌మాధవ్ పేర్లు ప్రస్తావించబడ్డాయి. పాకిస్తాన్ తరఫున రహమాన్, సజ్జయిడ్ హైదర్ ఖాన్, పూర్వ ఐఎస్ఐ నేతలు తదితరుల పేర్లు మీడియాలో వచ్చాయి. ట్రాక్ 1.5, ట్రాక్ –2 దౌత్యం అధికారిక ప్రభుత్వ చర్చలుకావు. మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ సైనికాధికారులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు, థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొని పరస్పర అభిప్రాయాలు పంచుకునే వేదికగా వీటిని భావిస్తారు. ప్రపంచంలోని అనేక సంక్షోభ ప్రాంతాల్లో ఇలాంటి చర్చలు గతంలో కూడా జరిగాయి. గత ఏడాది జులైలో లండన్‌లో జరిగిన ఐఐఎస్ఎస్ ట్రాక్ –1.5 సమావేశంతో ఈ శ్రేణి చర్చలు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. భారత్– పాకిస్తాన్ సంబంధాలు గత ఏడు దశాబ్దాలుగా యుద్ధాలు, ఉగ్రవాద దాడులు, సరిహద్దు ఉద్రిక్తతలు, దౌత్య వివాదాలతో సాగుతున్నాయి. ముఖ్యంగా పుల్వామా దాడి అనంతరం ఇరుదేశాల మధ్య అధికారిక దౌత్యచర్చలు దాదాపు నిలిచిపోయాయి. ఉగ్రవాదం, చర్చలు రెండూ కలిసి సాగవు అనే విధానాన్ని భారత్ పదేపదే ప్రకటించింది. అయితే ఇటీవలి ఏడాది కాలంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. లండన్‌కు చెందిన అంతర్జాతీయ వ్యూహాత్మక పరిశోధనా సంస్థ ఐఐఎస్ఎస్ నిర్వహించిన సమావేశాలు లేదా దాని సదస్సుల సందర్భంగా భారత్ –పాకిస్తాన్ ప్రతినిధుల మధ్య ట్రాక్–1.5, ట్రాక్ –2 స్థాయి అనధికారిక చర్చలు జరిగినట్లు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామం దౌత్య, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇవన్నీ బిజెపి పూర్వ ప్రధాన కార్యదర్శి, ఇండియా ఫౌండేషన్ అధ్యక్షులు రామ్‌మాధవ్, ఆర్ఎస్ఎస్ నాయకులు దత్తాత్రేయ హోస బోలె అమెరికా, యూరోప్ పర్యటనల తరువాత మరింతగా బలం పుంజుకొన్నాయి. దత్తాత్రేయ హోస బోలె ఇటీవల పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో, భారత్ పాక్‌ల మధ్య సామాజిక, సాంస్కృతిక రంగాలలో ప్రజల మధ్య చర్చలు కొనసాగాలని తెలిపారు. దీన్ని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ సంచాలక మోహన్ భగవత్ కూడా సమర్థిస్తూ ప్రకటన చేశారు. పాక్‌పట్ల మొదటి నుండి వ్యతిరేకంగా ఉండే ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు, ఒక్కసారిగా తమ పద్ధతి మార్చుకొని, పాక్‌పట్ల మెతక వైఖరితో వ్యవహరించడంలో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఒత్తడి ఉందనే ప్రచారం జరుగుతుంది. ఆపరేషన్ సిందూర్ తరువాత అమెరికా వైఖరి పూర్తిగా పాక్‌కు అనుకూలంగా ఉండడం, యుద్ధాన్ని మేమే ఆపామని ట్రంప్ ప్రకటించడం, ఆ తరువాతి వ్యాపార ఒప్పందం సంఘటనలు అన్నీ ఈ వాదనకు బలం ఇస్తున్నాయి. ఇరాన్ అమెరికా యుద్ధ విరామంలో కూడా పాక్ చురుకుగా పాల్గొనడంతో, అమెరికా పూర్తిగా పాక్‌కు అనుకూలంగా, భారత్‌పై ఒత్తడి తెస్తుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. ఈ అనధికార సమావేశాలు జరగడం కొత్తేమీ కాదు. కానీ ఒక్కసారిగా పాక్ భారత్‌ల మధ్య ఒక సంవత్సర కాలంలో 6 సార్లు ఈ సమావేశాలు జరగడం, భారత తరఫున మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద నరవానే, మాజీ దౌత్యవేత్త రుచి ఘనశ్యామ్, బిజెపి నాయకులు రామ్‌మాధవ్ పేర్లు ప్రస్తావించబడ్డాయి. పాకిస్తాన్ తరఫున రహమాన్, సజ్జయిడ్ హైదర్ ఖాన్, పూర్వ ఐఎస్ఐ నేతలు తదితరుల పేర్లు మీడియాలో వచ్చాయి. ట్రాక్ 1.5, ట్రాక్ –2 దౌత్యం అధికారిక ప్రభుత్వ చర్చలుకావు. మాజీ దౌత్యవేత్తలు, రిటైర్డ్ సైనికాధికారులు, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు, థింక్ ట్యాంక్‌ల ప్రతినిధులు పాల్గొని పరస్పర అభిప్రాయాలు పంచుకునే వేదికగా వీటిని భావిస్తారు. ప్రపంచంలోని అనేక సంక్షోభ ప్రాంతాల్లో ఇలాంటి చర్చలు గతంలో కూడా జరిగాయి. గత ఏడాది జులైలో లండన్‌లో జరిగిన ఐఐఎస్ఎస్ ట్రాక్ –1.5 సమావేశంతో ఈ శ్రేణి చర్చలు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. భారత, పాకిస్తాన్ మాజీ దౌత్యవేత్తలు, భద్రతా నిపుణులు, వ్యూహకర్తలు ఇందులో పాల్గొన్నట్లు మీడియా నివేదించింది. ఆ తరువాత అక్టోబర్‌లో ఒమన్‌లోని మస్కట్‌లో జరిగిన దక్షిణ ఆసియా రక్షణ సంవేశం సందర్భంగా మరో ట్రాక్ –1.5 సమావేశం జరిగినట్లు సమాచారం వెలువడింది. ఈ సమావేశంలో కూడా ఇరు దేశాల మాజీ అధికారులు, వ్యూహాత్మక నిపుణులు పాల్గొన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. డిసెంబర్‌లో థాయ్‌లాండ్‌లో మరో ట్రాక్ 2 సమావేశం జరిగింది. ఇది ఎవిూ కార్యక్రమం కాకపోయినా, భారత్– పాక్ మధ్య అనధికారిక సంభాషణల శ్రేణిలో భాగంగా ప్రస్తావించబడింది. ఇందులో మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ దౌత్యవేత్తలు, విద్యావేత్తలు పాల్గొన్నట్లు నివేదికలు వచ్చాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఖతార్ రాజధాని దోహాలో మరో ట్రాక్ –2 సమావేశం జరిగింది. బ్రిటన్‌కు చెందిన ఒక థింక్‌ట్యాంక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కూడా ఇరుదేశాలకు చెందిన మాజీ దౌత్యవేత్తలు, వ్యూహాత్మక నిపుణులు పాల్గొన్నట్లు సమాచారం వెలువడింది. అత్యంత చర్చనీయాంశమైన సమావేశం జూన్‌లో శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన సందర్భంగా వెలుగులోకి వచ్చింది. ఈ సదస్సు పక్కన భారత్– పాకిస్తాన్ ప్రతినిధుల మధ్య అనధికారిక చర్చలు జరిగినట్లు పలు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. కొంత మంది భారత, పాకిస్తాన్ ప్రముఖుల పేర్లు మీడియాలో ప్రస్తావించబడ్డాయి. అయితే వారిలో కొందరు తాము పాల్గొనడాన్ని బహిరంగంగా ఖండించగా, ఎవిూ కూడా పూర్తి పాల్గొనేవారి జాబితాను విడుదల చేయలేదు. ఈ సమావేశాలపై వార్తలు వెలువడిన తర్వాత భారత ప్రభుత్వం స్పందిస్తూ, ఇవి ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు కావని, ప్రభుత్వం తరఫున ఎలాంటి భాగస్వామ్యం లేదని స్పష్టం చేసింది. దీంతో ఈ చర్చలు పూర్తిగా స్వతంత్ర స్థాయిలో జరిగాయా లేక విధాన చర్చలకు అనుబంధ వేదికలుగా పని చేస్తున్నాయా అనే అంశంపై చర్చ మొదలైంది. ఈ పరిణామాల మధ్య ఆర్ఎస్ఎస్ నాయకుడు దత్తాత్రేయ హోసబలే పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉగ్రవాదంపై రాజీ ఉండదని చెబుతూనే, పాకిస్తాన్‌తో సంభాషణల తలుపులు పూర్తిగా మూసివేయకూడదని ఆయన అన్నారు. తరువాత ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ కూడా సంభాషణను పూర్తిగా తిరస్కరించకూడదనే భావనను వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలను కొందరు దౌత్యపరమైన పరిపక్వతగా చూడగా, మరికొందరు అధికారిక రాజకీయ వైఖరితో పోల్చి విశ్లేషించారు. దౌత్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ట్రాక్ –2 సమావేశాలు ప్రభుత్వ విధానానికి ప్రత్యామ్నాయం కావు. అయితే అధికారిక చర్చలు నిలిచిపోయిన సమయంలో సంక్షోభ నిర్వహణ, పరస్పర అవగాహన, అపార్థాల నివారణ వంటి అంశాల్లో ఇవి సహాయకరంగా ఉండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా– చైనా, అమెరికా –ఇరాన్, ఉత్తర కొరియా– దక్షిణ కొరియా వంటి దేశాల మధ్య కూడా గతంలో ఇలాంటి అనధికారిక చర్చలు జరిగాయి. అయితే భారత్– పాకిస్తాన్ సంబంధాల విషయంలో ప్రజల్లో ఒక సహజమైన ప్రశ్న తలెత్తుతోంది. ఒకవైపు ఉగ్రవాదంపై కఠిన వైఖరి ప్రకటిస్తూనే, మరోవైపు అనధికారిక స్థాయిలో సంభాషణలు కొనసాగడం పరస్పర విరుద్ధమా?

# మహనీయుల త్యాగ ఫలమే నేటి మన జీవితాలు

## టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/స్వామి వివేకానంద దొడ్డి కొమురయ్య వారి వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వార్డులో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అలాగే ఆదివారం మార్కెట్ లో ఉన్న దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ మహనీయుల త్యాగ ఫలిమే నేటి మన జీవితాలు,స్వామి వివేకానంద గారి ఉన్నతమైన ఆలోచనలు ప్రపంచానికి దారి చూపించి మార్గదర్శకుడు అయ్యారు,దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు వారి తెగువ తొలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది అని అన్నారు,ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ అంజనేయులు, తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, సీనియర్ నాయకుడు రఘుగౌడ్, సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కౌన్సిలర్లు రమేష్, మహేష్, వంశీ, రాజు గౌడ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ మార్గదర్శకాలను పాటించండి

## ఎన్యుమరేషన్ ఫారాలను నిపండి

## ఓటర్స్ క్లబ్ అధ్యక్షుడు జి. హన్మంత్ రావు

హైద్రాబాద్ జులై 4 ;ప్రతి ఓటరుకు తమ ఎన్యూమరేషన్ ఫారాలను నింపి ( BLO )బూతు లెవల్ ఆఫీసర్ అందజేయాలని ఓటర్స్ క్లబ్ అధ్యక్షుడు జి. హన్మంత్ రావు, భాను నగర్ కాలనీ నివాసితుల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి కోరారు.

శుక్రవారం యాకుత్‌పురా అసెంబ్లీ నియోజకవర్గంలో బీఎల్ఓల సూపర్‌వైజర్ ఎం.అశోక, 288 వ నంబర్ బూత్‌కు BLO పుష్ప లత తో కలిసి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఓటర్స్ క్లబ్ అధ్యక్షుడు జి. హన్మంత్ రావు, మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎన్యుమరేషన్ మార్గదర్శకాల కు అనుగుణంగా ఫారాలను నింపి దీూా లకు అందజేయలని కోరారు. సుధీర్ రెడ్డి బూతు లెవల్ ఏజెంట్ (దీూా)

మరియు ఇతరులు పాల్గొన్నారు.



# శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ శంకుస్థాపన

**భూత భవిష్యత్తు వర్తమానాలను తెలియజేసిన గొప్ప జ్ఞాని**

**పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామీ**

**బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**






సిద్ధిపెట జులై 4 :సిద్దిపేట జిల్లా మన్నానపల్లి గ్రామంలో శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ శంకుస్థాపబ్న కార్యక్రమం జరిగినది ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ ఆచారి బ్రహ్మంగారి జీడిమెట్ల దేవస్థాన కమిటీ అధ్యక్షులు భాను రీ కృష్ణమాచారి బీసీ కుల సంఘాల ప్రధాన కార్యదర్శి వలబోదు నరసింహ చారి బీసీ కుల సంఘాల రాష్ట్ర స్థానిక పెద్దలు బండోజు నాగభూషణం విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షులు ఈశ్వర చారి మాజీ అధ్యక్షులు యాదగిరి చారి ములుగు నరసింహులు మల్లెల మల్లేశం గ్రామ సర్పంచులు వార్డు మెంబర్లు విశ్వబ్రాహ్మణ మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరై ఆలయ శంకుస్థాపన కార్యక్రమం రంగా రంగా వైభవంగా జరిగినది.ఈ సందర్భంగా కొందారం గణేష్ చారి మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు బహుతా భవిష్యత్ వర్తమానం గురించి తెలియజేసిన మానసీయుడు లో కూడా ఇలాంటి వ్యక్తి పుట్టడం జరగలేదు ఇద్దరు మన జాతిలో పుట్టడం మన జాతికే గర్వకారణం 400 సంవత్సరాల పూర్వమే ఇప్పుడు జరిగేది జరగబోయేది భూత భవిష్యత్తు వర్తమానం గురించి తెలియజేసిన మానవుడు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారు ఆయన గుడి కట్టడం నిజంగా మన అదృష్టంగా భావించాలి మీరందరూ కలిసికట్టుగా గుడిని అభివృద్ధి చేయాలని కృష్ణమాచారి చెప్పారు వలబోజు నరసింహాచారి మాట్లాడుతూ



బ్రహ్మంగారిని పూజించడం చాలా శుభసూచకం అని అన్నారు బ్రహ్మాచారి మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో ఉండే జాతిని ముందుకు తీసుకెళ్లాలని ఈ గుడిని కూడా అదే విధంగా అభివృద్ధి పరచాలని మరి వాడ వాడ ప్రతి గ్రామములో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయాలు నిర్మించాలని బ్రహ్మాచారి గారు కోరారు

# పొంచి ఉన్న సూపర్ ఎల్సినో...ఆహార భద్రతకు ముప్పు తప్పదా?



హైద్రాబాద్ జులై 4: ఆహార భద్రతకు ముప్పు తప్పదా?వాతావరణ పరిస్థితులు అంతకంతకు అధ్వానంగా మారుతున్నాయి. నిపుణులు 'తీవ్రస్థాయి సూపర్ ఎల్నినో ముప్పు పొంచి ఉందంటూ హెచ్చరిస్తున్నారు. ఇండియా ఇప్పటికే దాని ప్రతికూల ప్రభావాలకు గురవుతోంది. పైగా ఈ ఏడాది రుతువవన వర్షపాతం దీర్ఘకాలిక నగటులో 90శాతమే ఉంటుందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇంతకీ దేశంపై ఎల్సినో ప్రభావం ఎలా ఉండనుంది? దాన్ని సమర్థంగా ఎదుర్కోవడమెలా? వసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో కొన్నాళ్లకిందట తటస్థంగా ఉన్న 'ఎల్నెనో-నదరన్ అసిలేషన్' పరిస్థితులు ఎల్నినో పరిస్థితులుగా మారుతున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది. మన దేశంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్నిన్ పరిస్థితులు ఏర్పదేందుకు అవకాశం ఉన్నట్లు భారత ఉష్ణమండల వాతావరణ అధ్యయన సంస్థ (ఐఐటీఎం), భారత వాతావరణ శాఖ(ఐఎండీ) పేర్కొన్నాయి. ఇతర అంతర్జాతీయ వాతావరణ నమూనాల అంచనాలూ ఇదే సూచిస్తున్నాయి. ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో కనిపిస్తున్న తటస్థ ద్విధ్రువ త(ఐవోడీ) పరిస్థితులు రుతుపవనాల కాలంలోనూ కొనసాగవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంటే, భారత్లో రుతుపవన కాలంలో ఎలి నినో ఏర్పడి, సెప్టెంబరు వరకు కొనసాగుతుందన్న నూట. దీనివల్ల వర్షపాతం గణనీయంగా తగ్గిపోయే ప్రమాదముంది. అంతవరకు మనం తీవ్రమైన వేడి, పొడి వాతావరణం, అలస్యపు వర్షాలతో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

జీవనోపాధికి గట్టి దెబ్బ

పసిఫిక్మహాసముద్రంలో ఏర్పడే ఎల్సినో శీతాకాలం వరకు కొనసాగవచ్చని పలు విదేశీ సంస్థలు సూచిస్తున్నాయి. ఇది మన రుతుపవనాలను తూర్పువైపు పసిఫిక్ మహాసముద్రంలోకి నెట్టే అవకాశం ఉంది. ప్రస్తుత ఉపగ్రహ డేటాను పరిశీలిస్తే, ఈ కదలిక స్పష్టంగా కనిపిస్తోంది. భారత్లో నమోదైన తీవ్రస్థాయి వడగాడ్పులు ఎల్సినో సంకేతాలేనని వాతావరణ నిపుణులు అంటున్నారు. ఈసారి వేసవిలో ఇండియా వివరీతమైన ఉష్ణోగ్రతలను చవిచూసింది. ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన పది నగరాలు మన దేశంలోనే ఉన్నాయని నివేదికలు తెలిపాయి. భారత ఉపఖండంలో నగటి, రాత్రి ఉష్ణోగ్రతలు రెండూ పెరిగాయి. మరోవైపు, హిమాలయాలకు ఉత్తరాన 2000-2500 కిలోమీటర్ల పొడవైన మేమాల సమూహం ఏర్పడింది. ఇది దక్షిణ దిశగా దూసుకొచ్చి గంగా మైదాన ప్రాంతాల్లో వాతావరణ జీభత్సాన్ని సృష్టించవచ్చు. ఈ వింత వాతావరణ పరిణామాల కారణంగా ఒక్క యూపీలోనే 30కి పైగా జిల్లాలు బలమైన గాలులు, తుపానులు, భారీ వర్షాలను చూశాయి.

ప్రజలు దీన్ని వేడి నుంచి ఉపశమనంగా భావించారు. కానీ, నిజానికి ఇది రుతువవనాలు ఉపఖండం లోపలికి విస్తరించకుండా అడ్డుకుంటున్న వాతావరణ వైపరీత్యం! వాతావరణ వరంగా 2026న సంవత్సరం తీవ్రమైన అనిశ్చితికి దారితీయవచ్చు. దీనివల్ల ఇకుట్ల పాలవనున్న వర్షాధార రైతులను ఆదుకోవడం పై ప్రభుత్వాలు శ్రద్ధ పెట్టాలి. ఎందుకంటే, మన సేద్య రంగంలో దాదాపు 60 శాతం మంది వర్షాలపై ఆధారపడినవారే. పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగు ద్వారా దేశానికి పౌష్టికాహారాన్ని అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. వర్షపాతం సగటు కంటే తగ్గితే, అది కేవలం ఆహార భద్రతను మాత్రమే కాకుండా, లక్షలాది రైతుల జీవనోపాధిని కూడా నేరుగా దెబ్బతీస్తుంది. ప్రస్తుత అస్థిర, అలన్య వాసల కారణంగా వర్షాధార రైతులు సంప్రదాయ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం శ్రేయస్కరం కాదు. గడచిన అయిదేళ్లలో భారతదేశం అతితక్కువ వ్యవధిలో అత్యధిక వర్షపాతం నమోదైన జూన్ నెలను, అత్యంత పొడి వాతావరణం కలిగిన అగస్టు, అక్టోబరు నెలలను చూసింది. తీవ్రమైన వడగాడ్పులు, పశ్చిము వాతావరణ కల్లోలాలు సంప్రదాయ వాతావరణ చక్రాలను పూర్తిగా మార్చేశాయి. దీనివల్ల వర్షాధార రైతులు తీవ్రంగా నష్టపోయి, అప్పుల ఊబిలో దిగబడిపోయారు. గడచిన అయిదేళ్లలో ఒక్క 2025-26లోనే రికార్డు స్థాయిలో ధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, 2021-22 నుంచి ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గడం వల్లే గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుసుతులపై తాత్కాలిక నిషేధం విధించాల్సి వచ్చింది. ఈ సమస్యలకు తోడు, ఇరాన్ యుద్ధం వచ్చిపడింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది.

నిల్వ సామర్థ్యం పెంచాలి

ఖరీఫ్ సీజన్ కోసం ప్రభుత్వం తగినన్ని ఎరువులను నిల్వ చేసినప్పటికీ, రబీ సీజన్ కుఅవిసరిపోకపోవచ్చు.0 వాతావరణ వైపరీత్యాలవల్ల వంటల సాగుకు రసాయన ఎరువులు, పురుగు మందుల అవసరం మరింత పెరుగుతుంది. కానీ, ఇప్పటికే వీటికి తీవ్ర కొరత నెలకొంది.. రాబోయే వాతావరణ పరిస్థితులపై విధానకర్తలు రైతులకు అవగాహన కల్పించాలి. ప్రతి జిల్లాలో వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాలను అందించాలి. వర్షాధార ప్రాంతాల్లో బహుళ పంటల సాగు చేపట్టేలా ప్రోత్సహించాలి. సేంద్రియ ఆవు పేడ, పెరటి ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి. మట్టిలో సేంద్రియ పదార్థం పెరిగేకొద్దీ, నేల నీటిని నిలువుకొనే సామర్థ్యం కూడా పెరుగుతుంది. జీవబొగ్గు (బయోవార్) సాయంతో నేల నాణ్యతను పెంపొందించే పద్ధతులను రైతులు వరిశీలించాలి. పొడి ప్రాంతాల్లో ఎక్కువగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును చేపట్టాలి. వర్షపాతం తక్కువగా ఉండే ప్రాంతాల్లో నీటిని, రసాయనాలను ఆదా చేయడానికి చిరుధాన్యాల సాగు మేలు. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోళ్లు పెంచడంతో పాటు ఆర్థిక ప్రోత్సాపాకాలను అందించాలి. వర్షాధార ప్రాంతాల్లో అత్యధిక భూములను వంటల బీమా పథకం వరిధిలోకి తీసుకురావాలి. ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ఎంతైనా అవసరం. ప్రతి గ్రామంలోనూ రైతుల భాగస్వామ్యంతో గిడ్డంగులను ఏర్పాటుచేసి, నిర్వహించేలా యువ పారిశ్రామికవేత్తలను+ ప్రోత్సహించాలి. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు ప్రతి వల్లెకూ ఆహార భద్రత చేకూరుతుంది.



# అస్థిర వర్షపాతంతో వ్యవసాయానికి కొత్త సవాలు

## (సి.హెచ్.ప్రతాప్)

ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల తీరు మరోసారి వ్యవసాయ రంగానికి కీలక హెచ్చరికగా మారింది. గతంలో వర్షపాతం పరిమాణమే పంటల విజయాన్ని నిర్ణయించేదని భావించేవారు. అయితే ప్రస్తుతం వర్షం ఎంత కురిసిందన్న దానికంటే, ఎప్పుడు కురిసింది, ఏ ప్రాంతంలో ఎంత కురిసింది, ఎంత తీవ్రతతో కురిసిందన్న అంశాలే రైతుల భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. ఒకవైపు దీర్ఘకాలం వర్షం లేక పొలాలు ఎండిపోతుండగా, మరోవైపు కొద్ది గంటల్లో కుండపోత వర్షాలు కురిసి పంటలకు నష్టం కలిగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

తెలంగాణలో అధిక శాతం సాగు వర్షాధారంగా సాగుతోంది. వరి, పత్తి, మొక్కజొన్న, పప్పుధాన్యాలు వంటి పంటలు సరైన సమయంలో కురిసే వర్షాలపై ఆధారపడతాయి. వర్షాలు ఆలస్యమైతే విత్తనాలు మళ్లీ వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అదే సమయంలో అధిక వర్షం కురిస్తే నేలలో నీరు నిలిచి మొక్కల ఎదుగుదల దెబ్బతింటుంది. ఈ పరిస్థితి రైతుల పెట్టుబడిని పెంచడంతో పాటు ఆదాయంపై కూడా ప్రభావం చూపుతుంది. వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ స్పష్టమవుతోంది. శాస్త్రవేత్తలు కూడా వర్షపాతం అస్థిరత భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాన్ని సూచిస్తున్నారు. అందువల్ల వ్యవసాయంలో సాంప్రదాయ పద్ధతులతో పాటు వాతావరణ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని పంటల ప్రణాళిక రూపొందించడం అత్యవసరంగా మారింది. తక్కువ నీటితో పెరిగే పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం, స్వల్పకాలిక వంగడాలను ఎంచుకోవడం, నేల తేమను సంరక్షించే విధానాలను పాటించడం వల్ల నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు.

వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ శాఖలు, వాతావరణ కేంద్రాలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సకాలంలో ఖచ్చితమైన సూచనలు అందించాలి. గ్రామస్థాయిలో వర్షపాతం నమోదును విశ్లేషించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సాగు సలహాలు ఇవ్వడం వల్ల పంటల నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. అలాగే చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, సూక్ష్మ సాగునీటి పద్ధతుల విస్తరణ, పంట బీమా వంటి చర్యలు రైతులకు మరింత భరోసా కలిగిస్తాయి.

తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తు కేవలం మంచి వర్షాలపై మాత్రమే ఆధారపడదు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించడం, నీటి వనరులను సమర్థంగా వినియోగించడం, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం, వాతావరణ అనుకూల వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారానే రైతుల ఆదాయాన్ని స్థిరపరచడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత సుస్థిరంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుంది.

# సుదీర్ఘ రాజకీయ అనుభవంతో విశిష్ట సేవలందించిన మహానేత రోశయ్య

**జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్**

**రోశయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమానికి కృషి చేయాలి**

**మాజీ గవర్నర్ కొణిజేటి రోషయ్యకు జిల్లా కలెక్టర్ నివాళి.**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై04 ప్రజాబలం:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో తనదైన ముద్ర వేసిన కర్షక నాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సౌమ్యత, విషయ పరిజ్ఞానం, నిబద్ధతతో కూడిన ప్రజానాయకుడు కీర్తిశేషులు కొణిజేటి రోశయ్య అని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సుదీర్ఘకాలం ఆర్థిక మంత్రిగా సేవలందించి, బడ్జెట్ రూపకల్పనలో అసాధారణ నైపుణ్యంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మహానేతగా ఆయన నిలిచారని పేర్కొన్నారు.



శనివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాజీ తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు, ప్రజాసేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, కొణిజేటి రోశయ్య గుంటూరు లో జన్మించారని, గుంటూరు హిందూ కళాశాలలో కామర్స్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఆయన, ఆంధ్ర ఉద్యమంతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి ప్రజా సేవలో అడుగుపెట్టారని పేర్కొన్నారు.

1968 నుంచి 1980 వరకు శాసనమండలి సభ్యుడిగా ప్రజలకు సేవలందించిన రోశయ్య, మర్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో తొలిసారిగా రోడ్లు--భవనాలు, రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. అనంతరం పలు ముఖ్యమంత్రుల మంత్రివర్గాల్లో ఆర్థిక శాఖతో పాటు అనేక కీలక శాఖలను సమర్థవంతంగా నిర్వహించి, తన పరిపాలనా దక్షతను చాటుకున్నారని అన్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నడిపిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టడంలో ఆయనకు ఉన్న అపార అనుభవం, నైపుణ్యం ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందన్నారు. 2009 సెప్టెంబర్ 3 నుంచి 2010 నవంబర్ 24 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన రోశయ్య, అనంతరం 2011 ఆగస్టు 31న తమిళనాడు గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి, 2016 ఆగస్టు 30 వరకు ఆ పదవిలో విశిష్ట సేవలందించారని కలెక్టర్ తెలిపారు.రోశయ్య నిరాడంబర జీవన విధానం, పరిపాలనా అనుభవం, ప్రజాసేవ పట్ల అంకితభావం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్న కలెక్టర్, ఆయన చూపిన మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొని కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ& పీజీ కళాశాలలో డిగ్రీ దూరవిద్యలో ప్రవేశాలు...



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జులై 4**జమ్మికుంట పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీడ పీజీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ దూరవిద్యలో బీఏ,బీకాం, బీఎస్సీ కోర్సులలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయిందని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎస్ ఓ కుమార్,కోఆర్డినేటర్ డాక్టర్ కే రాజేంద్రం లు తెలిపారు. ఈ ప్రవేశాలకు చివరి తేదీ 7.8.2026 లోగా దరఖాస్తు చేసుకోగలరని అన్నారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న వారు ట్యూషన్ ఫీజు చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు సమాచారం కొరకు 7382929775 నెంబర్ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# అల్పపీడనం.. అయినా భారీ వర్షాలు పడవు!



అమరావతి జులై 4 : వర్షాలపై వాతావరణ నిపుణులు షాకింగ్ న్యూస్ చెప్పారు. వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినప్పటికీ ఆశించిన స్థాయిలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని తెలిపారు. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తేలికపాటి వర్షాలు మాత్రమే పడతాయని పేర్కొన్నారు. అయితే రుతుపవనాలను చురుగ్గా మార్చడంలో ఈ అల్పపీడనం సహకరిస్తుందని వెల్లడించారు. దీంతో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురవొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# మారుతోన్న రాయలసీమ

కర్నూలు, జూలై 4, రాయలసీమ నుంచి ఎంతోమంది ముఖ్యమంత్రులు వచ్చారు. రాయలసీమ కేంద్రంగా ఎందరో రాజకీయాలు చేశారు. కానీ ఆ స్థాయిలో రాయలసీమ మాత్రం అభివృద్ధి చెందలేదు. కానీ కూటమి వచ్చిన తరువాత రాయలసీమ రూపురేఖలు మారుతున్నాయి. దశాబ్దాలుగా కేవలం కాగితాలకే పరిమితమై, రాజకీయ శంకుస్థాపనల డ్రామాతో విసిగిపోయిన కడప స్టీల్ ప్లాంట్ వ్యవహారంలో ఎట్టకేలకు ఒక బలమైన ముందడుగు పడింది. కడప స్టీల్ ప్లాంట్ కు శ్రీకారం చుట్టనున్నారు. ఇది కేవలం కొబ్బరికాయలు కొట్టే మరో సాంప్రదాయక భూమి పూజ కాదు. పక్కాగా నిర్మాణ పనుల ప్రారంభోత్సవం. జిందాల్ ఆధ్వర్యంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ తొలి దశ ఉత్పత్తిని అత్యంత వేగంగా అందుబాటులోకి తెచ్చేలా ఒక లక్ష్యాన్ని పెట్టుకున్నారు. ఇది నిజంగా రాయలసీమ చరిత్రలో సువర్ణ అధ్యాయం. ఒకప్పుడు ఫ్యాక్షన్ రాజకీయాలతో వివాదాల మయంగా మారిన రాయలసీమ.. ఇప్పుడు పారిశ్రామికంగా.. రాయల పరిశ్రమల సీమగా రూపాంతరం చెందుతూ ఉండడం శుభపరిణామం. ఉత్పత్తి రంగానికి సంబంధించిన పరిశ్రమలు రాయలసీమలో ఏర్పాటు అవుతున్నాయి. అయితే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా నిలబెట్టడంలో శ్రీ సిటీ కీలక పాత్ర పోషించింది. గ్లోబల్ కంపెనీలకు క్యారాఫ్ అడ్రస్ గా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ జరుగుతున్న పరిశ్రమల జాతర ఒక ఎత్తు అయితే.. ఇటీవల ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగాల్లో వచ్చిన పెట్టుబడులు మరో ఎత్తు. రాయల్ ఎన్ఫీల్డ్, హీరో మోటో కార్ఫ్ వంటి దిగ్గజ సంస్థలు రాయలసీమలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో తమ ప్లాంట్లను నిర్మించాయి. వేలాదిమంది స్థానిక యువతకు, గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించాయి. గతంలో వచ్చిన కియా మోటార్స్ అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించింది. అయితే ప్రస్తుతం శ్రీ సిటీ ఉమ్మడి చిత్తూరు జిల్లా పారిశ్రామిక వైభవానికి సరికొత్త కేంద్రంగా మారింది. అన్నింటికీ మించి రాయలసీమ గ్రీన్ ఎనర్జీ రంగంలో దేశంలోనే టాప్ హబ్ గా మారింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో గ్రీన్ కో, ఆర్సెలర్ మిట్టల్, ఐర్ఈడిఏ భాగస్వామ్యంతో ప్రపంచంలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు వేగం గా రూపుదిద్దుకుంటున్నాయి. గతంలో వెనుకబడిన ప్రాంతంగా.. కరువు సీమగా ముద్రపడిన రాయలసీమ.. ఇప్పుడు పరిశ్రమలకు స్వర్గధామంగా మారింది. అటు బెంగళూరు ఐటి, ఆటోమొబైల్ క్యారీడర్.. ఇటు చెన్నై పోర్టులకు కనెక్టివిటీ ఉండడంతో రాయలసీమ కు ప్లస్ పాయింట్ గా నిలుస్తోంది. ప్రధానంగా ఖనిజ సంపద, ఇనుప ఖనిజం, సున్నపురాయి నిల్వలు భారీ సిమెంట్, స్టీల్ పరిశ్రమలకు బలమైన పునాదులుగా మారాయి. బలమైన రాజకీయ సంకల్పం, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళు తుండడంతో రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధి సాధ్యం అవుతుంది.

మంటపెట్టిన జిందాల్ ట్వీట్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడు ఏ టర్న్ తీసుకుంటాయో ఊహించడం చాలా కష్టం. నిన్నటి వరకూ ఓ లెక్కన సాగిన రాజకీయం.. నేటి ఉదయానికి మరోలా మారిపోతుంది. అధికార టీడీపీ కూటమి, విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య సాగుతున్న పొలిటికల్ వార్‌లో.. "క్రెడిట్" అనే అంశం చాలా కీలకంగా మారుతోంది. ఏ అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి అయినా మేమంటే మేమే కారణమనే వైఖరి పార్టీలలో కనిపిస్తోంది. మొన్నటి గూగుల్ డేటా సెంటర్ మొదలుకుని.. నేటి కడప స్టీల్ ప్లాంట్ వరకూ పొలిటికల్ పార్టీలు ఈ" క్రెడిట్"ను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉండగా.. ఆయా పార్టీల మద్దతుదారులు సోషల్ మీడియాలో వీటిని హోరెత్తిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సీఎం చంద్రబాబు ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రెండు దశాబ్దాల రాయలసీమ ప్రజల కల ఈరోజు నెరవేరిందన్నారు. సున్నపురాళ్లపల్లిలో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించి ఈ కలను నిజం చేశామని ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో కేవలం శంకుస్థాపనలతో సరిపెట్టి ప్రజలను మభ్యపెడితే... మేం పనులు మొదలుపెట్టి రాయలసీమ స్టీల్ ప్లాంటుకు వాస్తవరూపం ఇస్తున్నామని పనిలోపనిగా వైసీపీపైనా విమర్శలు చేశారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామన్నారు చంద్రబాబు. కడపలో స్టీల్ ప్లాంట్ పనుల ప్రారంభంపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. సజ్జన్ జిందాల్, జేఎస్ డబ్ల్యూ స్టీల్ బృందానికి అభినందనలు తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమైన మైలురాయిగా జగన్ అభివర్ణించారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంటూ ట్వీట్ చేశారు. ఎన్నో ఏళ్ల కృషి, ప్రణాళిక అనే పునాదులపై ఇలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు నిర్మితమవుతాయన్న వైఎస్ జగన్.. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే కడప స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టుకు కీలకమైన పునాదులు వేశామన్నారు. పర్యావరణ అనుమతులు, నీటి కేటాయింపు, భూముల కేటాయింపు, రహదారుల అనుసంధానం వంటి మౌలిక సదుపాయాల కోసం భూమిని అందించామన్నారు. ఈ కారణాలతోనే ప్రాజెక్టు వేగంగా కదిలిందన్న జగన్.. కూటమి ప్రభుత్వం రెండేళ్లుగా ఈ ప్రాజెక్టు పనులు నిలిపివేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా పనులు ప్రారంభం కావటం సంతోషకరమంటూ జేఎస్‌డబ్ల్యూ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. మరోవైపు జగన్ చేసిన ట్వీట్‌కు సజ్జన్ జిందాల్ రిప్లై ఇచ్చారు." మీ శుభాకాంక్షలకు ధన్యవాదాలు, జగన్ గారు.. మీ ప్రభుత్వ హయాంలో లభించిన ప్రారంభ అనుమతుల నుంచి నేటి ఈ ప్రారంభోత్సవం వరకు సాగిన ఈ ప్రయాణం నిరంతర కృషికి నిదర్శనం. ఈ ప్రాంత యువత, కుటుంబాల కోసం ఈ ప్రాజెక్ట్‌ను వేగంగా పూర్తి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము." అంటూ జిందాల్ ట్వీట్ చేశారు. సజ్జన్ జిందాల్ ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో టీడీపీ వర్సెస్ వైసీపీగా మారుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతుల ద్వారానే కడప స్టీల్ ప్లాంట్ సాధ్యమైందని స్వయంగా జిందాల్ చెప్పారని వైసీపీ మద్దతుదారులు ట్వీట్లు చేస్తున్నారు. జగన్ హయాంలో వేగంగా ఇచ్చిన అనుమతులతోనే ఈ ప్రాజెక్టు కల సాకారమవుతోందని.. టీడీపీ ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని విమర్శిస్తున్నారు. అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావాల్సిన నీరు, కరెంట్, రహదారులు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చేసి.. పనులు ప్రారంభమయ్యేలా చేసింది చంద్రబాబు ప్రభుత్వమని టీడీపీ శ్రేణులు కౌంటరిస్తున్నాయి.

# మావిగన్ పై ధర్మాన ఆగ్రహం..

శ్రీకాకుళం, జూలై 4, రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు కొందరు నాయకులు. కానీ ఏపీలో రాజకీయాలు మారిపోవడంతో వారి బాధ అంతా కాదు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రస్థాయి నేతలుగా చలామణి అయ్యారు. చాలా స్వేచ్ఛగా రాజకీయాలు చేశారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంట్రీ తో చాలామంది నేతల తలరాతలు మారిపోయాయి. రాజకీయాల్లో ఉన్నామంటే ఉన్నాం అన్నట్టు వారి వ్యవహార శైలి ఉంది. పదవులు సైతం ఉన్నా అధికారం వెలగబెట్టలేని పరిస్థితి వారిది. ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో వారు సతమతం అవుతున్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లే క్రమంలో పలుచన అవుతున్నారు. రాజధానుల అంశానికి సంబంధించి జగన్మోహన్ రెడ్డి వైఖరితో విసిగి వేసారి పోతున్నారు కొంతమంది సీనియర్లు. అటువంటి వారిలో ధర్మాన ప్రసాద రావు ముందుంటారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండే ధర్మాన.. అదే జగన్మోహన్ రెడ్డి కింద పని చేయాల్సి వచ్చింది. ప్రత్యామ్నాయం లేకపోవడంతో జగన్ విధానాలను సమర్థించాల్సి వచ్చింది. ఇప్పుడు అవే చేటు తెస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మంత్రిగా వ్యవహరించారు ధర్మాన ప్రసాదరావు. తొలి మూడేళ్లు ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. దీంతో మౌనమునిగా మారిపోయారు. మంత్రి పదవి ఇచ్చేసరికి యాక్టివయ్యారు. జగన్మోహన్ రెడ్డి మంచితనాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయనకు విశాఖ పాలన రాజధాని అస్త్రం దొరికింది. గ్రామాల్లో ఏకంగా సభలు ఏర్పాటు చేసి జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర కోసం విశాఖను రాజధానిగా చేర్చారని.. ఆయన రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ప్రజలు ఆ మాటలను విశ్వసించలేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించలేదు. అయితే జగన్మోహన్ రెడ్డి మావిగన్ స్టాండ్ తీసుకోవడంతో ధర్మాన ప్రసాదరావు లాంటివారు డిఫెన్స్ లో పడిపోయారు. వాస్తవానికి 2014 ముందు ధర్మాన ప్రసాదరావు కాంగ్రెస్ పార్టీ నేతగా ఉంటూ.. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన చెప్పే మాటకు విశ్వాసం, విశ్వసనీయత ఉండేది. మంచి వాగ్దాటితో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపగల నాయకుడిగా పేరు ఉండేది. ఎప్పుడైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. జగన్మోహన్ రెడ్డి విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం.. అవి ఎప్పటికప్పుడు మారిపోతుండడంతో ధర్మాన ప్రసాదరావు వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసేలా చేశాయి. వాస్తవానికి ధర్మాన ప్రసాదరావు జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని విభేదిస్తారన్న కామెంట్ ఉంది. జగన్ వైఖరిని పెద్దగా ఇష్టపడరని కూడా అనుచర వర్గం చెబుతుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో.. గత్యంతరం లేని స్థితిలో జగన్ పంచన చేరారు అని కూడా కామెంట్స్ ఉన్నాయి. కానీ అదే జగన్ విధానాలను బలంగా బలపరిచి ధర్మాన ప్రసాదరావు మరింత బలహీనం అయ్యారు. విశాఖ రాజధాని విషయంలో అతి చేశానని.. మావిగన్ స్టాండ్ తో జగన్మోహన్ రెడ్డి దారుణంగా దెబ్బతీశారన్న ఆవేదనతో ఉన్నారట ధర్మాన. చూడాలి ధర్మాన ఎలా ముందుకు వెళ్తారో..

# అవినీతిలో భీమిరెడ్డి బాహుబలి

హైదరాబాద్, జూలై 4, ఆయన పేరు భీమిరెడ్డి.. తెలంగాణ పోలీస్ శాఖలో డిఎస్పి. డిజిపి ఆఫీసులో స్టేషనరీ వింగ్లో పనిచేస్తూ ఉంటారు. ఈయన ఇంట్లో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు మొదలుపెట్టారు. భారీగా సోదాలు చేశారు. ఈ సోదాలలో ఏకంగా వందల కోట్ల ఆస్తులను అవినీతి నిరోధక శాఖ అధికారులు గుర్తించారు. పోలీస్ శాఖలో ఈ స్థాయిలో అక్రమ సంపాదన ఉంటుందా అని ఏసీబీ అధికారులు నోటి మీద వేలుసుకుంటున్నారు. అసలు ఇంతటి సంపాదన ఎలా సాధ్యమంటూ ఆశ్చర్యపోతున్నారు.

# రాజధాని చుట్టూ మరోసారి రగడ..

విజయవాడ, జూలై 4, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంశం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. రాజధాని అభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, ప్రతిపక్షం నుంచి వస్తున్న రాజకీయ వ్యాఖ్యలు కొత్త చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యంగా రాజధాని భవిష్యత్తుపై వస్తున్న ప్రకటనలు పెట్టుబడిదారులు, వ్యాపార వర్గాలు, ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ) అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో నిలిచిపోయిన అనేక అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించడంతో పాటు, దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రభుత్వం కొనసాగిస్తోంది. మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యా సంస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. అయితే ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన "మావిగన్" వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు కారణమయ్యాయి. ఈ ప్రకటనతో రాజధాని అంశం మరోసారి ప్రధాన రాజకీయ అజెండాగా మారింది. ఈ పరిణామాలు అమరావతి అభివృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పెట్టుబడుల విషయంలో అనిశ్చితి నెలకొనే అవకాశం ఉందని కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం అమరావతిలో పరిశ్రమలు, ఐటీ సంస్థలు, వ్యాపార సంస్థలు పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. కానీ రాజధానిపై తరచూ రాజకీయ వివాదాలు కొనసాగితే కొంతమంది పెట్టుబడిదారులు నిర్ణయాలు వాయిదా వేసే పరిస్థితి ఏర్పడవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. పెట్టుబడులకు స్థిరమైన వాతావరణం చాలా అవసరమని వారు సూచిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంపై కూడా ఈ తరహా రాజకీయ చర్చల ప్రభావం ఉండొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో రాజధాని అంశంపై వచ్చిన వివిధ నిర్ణయాల కారణంగా నిర్మాణ రంగం మందగించిన పరిస్థితులు కనిపించాయి. ప్రస్తుతం తిరిగి నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్న సమయంలో మరోసారి అనిశ్చితి ఏర్పడితే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభావం పడే అవకాశాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా క్రమంగా విస్తరిస్తున్నాయి. కొత్త సంస్థలు, సేవా రంగ సంస్థలు, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి సమయంలో రాజకీయ ప్రకటనలు వ్యాపార నిర్ణయాలపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం విశ్వాసాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలపరిచే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయనే సందేశాన్ని స్పష్టంగా చేరవేయడం, రాజధాని నిర్మాణంపై దీర్ఘకాలిక ప్రణాళికలను ప్రజలకు వివరించడం కూడా కీలకమని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే అమరావతి అంశం కేవలం రాజకీయ చర్చకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో ముడిపడి ఉంది. అందువల్ల రాజకీయ విభేదాల కంటే అభివృద్ధి, స్థిరత్వం, ప్రజల విశ్వాసానికి ప్రాధాన్యం ఇచ్చే నిర్ణయాలే రాష్ట్ర భవిష్యత్తుకు మరింత ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

విజయసాయిరెడ్డి సలహాలు

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి వర్సెస్ మావిగన్ చర్చ తెరపైకి వచ్చింది. 2029 ఎన్నికల్లో మావిగన్ ఎజెండాతో ప్రజల్లోకి వెళతామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యలతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కూటమి పార్టీలు కూడా అప్పుడు మూడు రాజధానులు, ఇప్పుడు మావిగన్ పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని జగన్‌కు కౌంటర్ ఇస్తున్నాయి.

తాజాగా అమరావతి వర్సెస్ మావిగన్ అంశంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ రెండు అంశాలపై తన అభిప్రాయాలను చెప్పుకొచ్చారు. టీడీపీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమేనని చెబుతోందని.. వైఎస్సార్‌సీపీ మావిగన్ అంటోందని.. ఒక బాధ్యత కలిగిన ఒక పౌరుడిగా రెండు రాజకీయపార్టీలు చేస్తున్న భిన్న అర్థరహిత వాదనలు చూసిన తర్వాత తన అభిప్రాయాలను అందరితో పంచుకుంటున్నాను అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఎక్కడ ఏర్పాటుచేయాలనే అంశంపై గతంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను వీరంతా ఎందుకు పక్కన పెట్టారని ప్రశ్నించారు

విజయసాయిరెడ్డి. 2014లో రాష్ట్ర విభజన జరిగిందని.. 12 ఏళ్లు అవుతున్నా సరే ఇంకా రాజధాని ఎక్కడ ఉండాలనే చర్చ జరుగుతోందని.. ఇది అందరూ సిగ్గుపడాల్సిన విషయమన్నారు. రాష్ట్రం విడిపోయిన 15 ఏళ్ల తర్వాత.. అంటే 2029లో మరోసారి సార్వత్రిక ఎన్నికలు రానున్నాయని.. ఆ ఎన్నికల్లో కూడా రాజధాని ఎక్కడ ఉండాలో ప్రజలు మరోసారి నిర్ణయించాలా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజధాని పేరుతో చేస్తున్న ఈ పొలిటికల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను ఆపేయాల్సిన బాధ్యత అన్ని పార్టీల మీదా ఉందా? లేదా? అన్నారు. అమరావతిలో మొదటి విడతలో ల్యాండ్ పూలింగ్‌కు రైతులకు భూములు ఇచ్చారని.. కానీ ఇప్పటికీ వారికి ప్లాట్లు అప్పగించలేదని, అసలు కేటాయింపులు చేయలేదని.. దీనిని ఎలా సమర్థించుకుంటారని.. లక్ష ఎకరాలు రాజధానికి ఏం చేసుకుంటారని ప్రశ్నించారు విజయసాయిరెడ్డి. వీజీటీఎం కాన్సెప్ట్ (విజయవాడ?గుంటూరు?తెనాలి?మంగళగిరి ) విభజన చట్టంలోనే ఉందని.. ఈ ప్రాంతం అంతటికీ రాజధాని భవనాలను విస్తరిస్తే అందులో పోయేది ఏం ఉంటుందని ప్రశ్నించారు విజయసాయి. ప్రధానంగా రాజధాని నిర్మాణం పేరుమీద అవినీతి జరుగుతోందని.. కూటమి ప్రభుత్వం రాజధాని కోసం ఏకంగా రూ. 50 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నార విజయసాయి. అమరావతిలో జరుగుతున్న ప్రతి నిర్మాణంలో భారీగా నిర్మాణ వ్యయాన్ని పెంచి చూపించారని ఆరోపించారు.

దీన్ని బట్టి రాజధానిలో అవినీతికి పథకం వేస్తున్నారని.. అందుకే అమరావతి అనే అందమైన పేరు పెట్టారన్నారు. అమరావతిని దేవతల రాజధాని అంటూ బ్రహ్మాండమైన అబద్ధపు బ్రాండింగ్ ఇచ్చారన్నారు. నేరుగా అధికారంలో ఉన్న వారు ఈ దేవతల రాజధాని బ్రాండింగ్ వాడుకుంటూ 25 నుంచి 30 శాతం డబ్బును లంచాలుగా తీసుకుంటున్నారని ఆరోపించారు.

వాస్తవానికి అమరావతిలో ఉన్న అమరేశ్వరుడి ఆలయం, బుద్ధ విగ్రహం ఉన్న అమరావతికి.. ఇప్పుడు నిర్మాణం చేస్తున్న బిల్డింగులు ఉన్న ప్రాంతం 50 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. అమరావతి దైవ క్షేత్రం, కృష్ణమ్మ ప్రవహిస్తున్న క్షేత్రం అయితే.. ఈ అమరావతి అవినీతి పారుతున్న క్షేత్రం అని ఘాటుగా స్పందించారు.'

అమరావతి బిల్డింగుల నిర్మాణానికి ఏకంగా రూ 50 వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పుడు అందులో 25?30 శాతం అవినీతికి ఆస్కారం కనిపిస్తున్నప్పుడు.. ఈ అవినీతిని మనమంతా ప్రజలుగా మొదట ప్రశ్నించాలి.

అంటే ఇది దాదాపు 15 వేల కోట్ల లంచాల మేతకు వేసిన పథకం. మరి ఈ విషయాన్ని వదిలేసి మావిగన్ అనటం వల్ల ప్రయోజనం ఏమిటి? మరో మూడేళ్ళలో జరిగిపోయే నిర్మాణాలన్నీ ఏం చేద్దాం? రాజధానిని నిర్మించటం అంటే అవినీతికి బాగా ఆస్కారం ఉన్న బిల్డింగులు ఏ పార్టీ కట్టాలి... ఎంత కమీషన్లు కొట్టాలి అన్నది కాదు కదా?. కాబట్టి, అమరావతి పేరిట జరుగుతున్న అవినీతి యజ్ఞాన్ని ప్రజలందరి తరఫున ప్రశ్నిస్తూ, ఎస్కలేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో అవినీతిని సవాలు చేస్తూ త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను' అంటూ విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు.

# ఢిల్లీలో రూ.105 కోట్లతో సరికొత్త ఏపీ భవన్..!

విజయవాడ, జూలై 4, దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను చాటేలా సరికొత్త ఏపీ భవన్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. విభజన అనంతరం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ భవన నిర్మాణ ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. అక్షరాలా రూ. 105 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. ఢిల్లీకి వచ్చే రాష్ట్ర పౌరులకు, ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అత్యుత్తమ సేవలు అందించేలా, అన్ని రకాల అత్యాధునిక వసతులతో ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఈ నూతన ఏపీ భవనాన్ని సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో నిర్మించనున్నారు. ఇది కేవలం ఒక అతిథి గృహంగానే కాకుండా, ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పూర్తి స్థాయి పరిపాలన మరియు ఆతిథ్య కేంద్రంగా సేవలందించనుంది. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన దౌత్యపరమైన సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు, మరియు సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేలా ఇందులో కాన్ఫరెన్స్ హాళ్లు, వీఐపీ లాంజ్‌లు మరియు ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక భవన నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నేషనల్ బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ కార్పొరేషన్' కి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వ నిర్మాణ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భవనాలను నిర్మించడంలో ఎన్‌బీసీసీకి మంచి గుర్తింపు ఉంది. ఈ కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో ఎలాంటి లోపాలు లేకుండా, నిర్ణీత కాలవ్యవధిలోనే అత్యంత నాణ్యతతో కూడిన హంగులతో ఈ నూతన ఏపీ భవన్ నిర్మాణం పూర్తి కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత, ఢిల్లీలోని ఏపీ భవన్ ఆస్తుల పంపిణీకి సంబంధించి తెలంగాణ ప్రభుత్వంతో సాగిన సుదీర్ఘ వివాదానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం ప్రకారం.. ఏపీ వాటాగా వచ్చిన భూమిలోనే ఈ సరికొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

# 3,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాడమే ప్రభుత్వ లక్ష్యం...

**పైడిగుమ్మల్‌లో ఘనంగా ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్**

**--రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**-ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి**







**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**కోహీర్/మండలం పరిధిలోని పైడిగుమ్మల్ గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ఘనంగా నిర్వహించడం జరిగిందని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించి రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించడంతో పాటు అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టేలా ప్రోత్సహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి ఆయిల్ పామ్ మొక్కను నాటి మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా ఆయిల్ పామ్ తాజా పండ్ల గుత్తి ( ఎఫ్.ఎఫ్.బి) కొనుగోలు ధరను టన్నుకు రూ.23,700కు పెంచిందని తెలిపారు,ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని, జిల్లాలో ఆయిల్ పామ్ విస్తరణకు సహకరించాలని పిలుపునిచ్చారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 3,000 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా,ఆ దిశగా రైతులు ముందుకు రావాలని కోరారు,జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన, అధిక ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన మొక్కలు, సబ్సిడీలు, సాంకేతిక మార్గదర్శకాలు తదితర ప్రోత్సాహకాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి సునీత, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు,ఉద్యాన శాఖ అధికారులు,డ్రిప్ సిబ్బంది, పరిసర ప్రాంతాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంతులేని అమరనాధుడి కథ, పౌర్ణమికి పెరుగుతుంది.. అమావాస్యకు తగ్గుతుంది..

శ్రీనగర్ జూలై 4, మనదేశంలో స్వయంభు శైవ క్షేత్రాలు చాలానే ఉన్నాయి. ఇక్కడ శివుడిని రకరకాల పేర్లతో భక్తులు పిలుస్తారు. ఇక్కడ ఏర్పడిన శివలింగాల వెనుక వందల సంవత్సరాల చరిత్ర ఉంది. వీటి స్థల పురాణాలు కూడా అద్భుతంగా ఉంటాయి. ప్రతి స్థల పురాణానికి బలమైన నేపథ్యం ఉంటుంది. శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి.. ఆయా క్షేత్రాలలో కైలాస వాసుడికి ఘనమైన పూజలు జరుగుతుంటాయి.శైవ క్షేత్రాలలో శివుడు స్థిరమైన రూపంతో కలిగి ఉంటాడు. కానీ మనదేశంలో జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలోని అమర్నాథ్ ప్రాంతంలో మాత్రం శివుడి రూపం కేవలం కొద్దిరోజులు మాత్రమే ఉంటుంది. వర్షాకాలం సీజన్ పరమైన తర్వాత అమర్నాథ్ ప్రాంతంలో శివుడి లింగం ఏర్పడుతూ ఉంటుంది. అది కూడా అత్యంత సహజంగా ఉంటుంది.. జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో కైలాస క్షేత్రం ఉందని.. అక్కడ శివుడు ధ్యానముద్రలో ఉంటాడని.. ఆ క్షేత్రానికి వెళ్లడం సాధ్యం కాదని.. ఇప్పటికే అనేక పర్యాయాలు చాలామంది ప్రయత్నించినప్పటికీ కఠినమైన వాతావరణం వల్ల వెనక్కి తిరిగి వచ్చారని వార్తలు ప్రాచుర్యంలో ఉన్నాయి.ఇప్పటికీ మంచు రూపంలో శివలింగం ఏర్పడే విధానం ఒక మిస్టరీగానే ఉంటుంది. జమ్ము కాశ్మీర్లోని అమర్నాథ్ గుహ ప్రాంతంలో ఈ శివలింగం ఏర్పడుతూ ఉంటుంది. ఇక్కడి అమర్నాథ్ గుహ సముద్రమట్టానికి నాలుగు వేల మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఏ గుహ పైకప్పు భాగం దృఢంగా ఉంటుంది. ఈ భాగంలో సున్నపురాయి.. జిప్సం వంటి శిలలు ఉంటాయి. హిమాలయ ప్రాంతాల్లో ప్రవహించే నదులు.. కొండల ప్రాంతంలో ఉన్న మంచు కరిగిపోతున్నప్పుడు.. ఆ నీరు మొత్తం బండరాళ్ల పగుళ్ల మీదుగా గుహలోకి వెళ్తూ ఉంటుంది. అధి కాస్త చుక్కలు చుక్కలుగా కారి.. శివుడి లింగం మాదిరిగా ఏర్పడుతూ ఉంటుంది.అమర్నాథ్ గుహలో ఉష్ణోగ్రతలు అత్యంత తక్కువగా ఉంటాయి.. ఇవి మైనస్ డిగ్రీలలో ఉంటాయి. అక్కడ నీటి బిందువులు పడగానే.. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత వల్ల వెంటనే గడ్డ మాదిరిగా మారిపోతాయి.ఇలా చుక్కలు చుక్కలుగా పడిన మంచు బిందువులు ఒకదానిపై ఒకటి వేరుకొని పోతూ ఉంటాయి. అలా పైకి లింగం మాదిరిగా ఎదుగుతూ ఉంటాయి. ఈ ప్రక్రియ కొద్ది రోజులపాటు జరుగుతూ ఉంటుంది. ఫలితంగా అది ఒక మంచు స్థంభం మాదిరిగా మారిపోతుంది. అది చూసేందుకు శివలింగంలాగా కనిపిస్తూ ఉంటుంది.శివలింగం కాలాలకు అనుగుణంగా పెరుగుతుంది.

## విజయనగరంలో రియల్ జోరు...

విజయనగరం జూలై 4, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుంది. మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభోత్సవంతో జాతికి అంకితం చేయనున్నారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పనులన్నీ పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి ముస్తాబయింది. ఉత్తరాంధ్ర తలరాతను మార్చబోతోంది ఈ విమానాశ్రయం. అయితే ఎయిర్పోర్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. విజయనగరం జిల్లా సరిహద్దులతోపాటు భోగాపురం చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో భూములతో పాటు ఇళ్ల స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఇన్వెస్టర్లు పెట్టుబడి పెట్టేందుకు భారీగా ముందుకు వస్తున్నారు.సాధారణంగా వెంచర్లలో ప్లాట్లు విక్రయిస్తుంటారు. కానీ భోగాపురంలో ఓపెన్ ప్లాట్ల వెంచర్ల స్థానంలో.. సరికొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కమర్షియల్ విల్లా ప్రాజెక్టులు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు వెలుస్తున్నాయి. ఎయిర్పోర్ట్ కారిడార్ ఆనుకొని ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా.. వందల ఎకరాల్లో ఆధునిక టౌన్షిప్ ల నిర్మాణాలు ఊపందుకున్నాయి. విమానాశ్రయ కార్యకలాపాలు ప్రారంభమైతే.. ఈ ప్రాంతం ఒక పెద్ద ఎకానమిక్ హబ్ గా మారనుంది. ప్రధానంగా ప్రీమియం నివాస గృహాలకు, కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ విపరీతంగా పెరిగింది.ఉత్తరాంధ్రలో వలసలు ఎక్కువ. ఆపై చదువుకున్న వారు సైతం విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో స్థిరపడిన వారు ఉన్నారు. అటువంటి వారంతా భోగాపురం పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఉన్నత రంగాల్లో స్థిరపడిన వారు మాత్రం కమర్షియల్ విల్లాలు, లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. ప్లాట్ లతోపాటు వెళ్లాలని ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. తమ సొంత గడ్డపై అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం పక్కనే స్థిరాస్తి కలిగి ఉండడాన్ని గొప్పగా భావిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ధర పెరుగుతుందన్న ఆశతో ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు.ఒక్క భోగాపురం మాత్రమే కాదు విజయనగరం జిల్లాలోని రెండు మూడు నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం లో సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంటుంది భోగాపురం విమానాశ్రయ నిర్మాణంతో. భూములతో పాటు ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు కూడా భారీగా జరుగుతున్నాయి. ఉత్తరాంధ్రలోని ఉమ్మడి మూడు జిల్లాలకు ప్రధాన కేంద్రంగా మారనుంది భోగాపురం. భవిష్యత్తులో భోగాపురం ఒక నగరంగా అవతరించనుంది. వారం వారం ఇక్కడి చదరపు గజం ధరలు మారుతుండడంతో స్థానిక రైతులు, భూ యజమానులకు ఊహించని రీతిలో ఆర్థిక ప్రయోజనం చేకూరుతోంది

## మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనం..
## కాంగ్రెస్ లో ఎన్సీపీ విలీనం?

ముంబై, జూలై 4, మహారాష్ట్రలో సంచలనమైన విషయం బయటికి వస్తోంది. మహారాష్ట్ర రాజకీయాలను శాసించిన పార్టీగా ఎన్సీపీకి, దాని అధినేత శరద్ పవార్ కి ఓ పేరుంది. కానీ.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎన్సీపీని కాంగ్రెస్ లో విలీనం చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీని వెనుక కాంగ్రెస్ అధిష్ఠానంతో తెరువెనుక చర్చలు కూడా జరుగుతున్నాయని తెలుస్తోంది. ప్రాథమికంగా శరద్ పవార్ కాంగ్రెస్ లో తన పార్టీని విలీనం చేసేందుకు సిద్ధమైనట్లు అంటున్నారు.మహా వికాస్ అగాఢీ లో లుక లుకలు, ప్రస్తుత రాజకీయాల కారణంగా శరద్ పవార్ విసిగిపోయినట్లు తెలుస్తోంది. మహా వికాస్ అగాఢీ అధికారంలో వున్న సమయంలో శరద్ పవార్ ఎంత చెబితే అంతలా రాజకీయాలు నడిచాయి. కానీ.. మహా వికాస్ అగాఢీని, మరీ ముఖ్యంగా ఉద్ధవ్ వర్గంలో చీలిక రావడం, రాజకీయాలు మారిపోవడంతో శరద్ పవార్ ఈ నిర్ణయానికి వచ్చారు.ఒకవేళ ఈ విలీనం జరిగితే మాత్రం మహారాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. మహారాష్ట్ర రాజకీయాలకు పెద్ద దిక్కుగా వున్న శరద్ పవార్ ఇక రాజకీయాల నుంచి తప్పుకున్నట్లే లెక్క. అజిత్ పవార్ దివంగతులయ్యారు.

## రాజకీయాల్లో క్లాసిక్ 'సిండ్రోమ్'

హైదరాబాద్, జూలై 4, ఎన్నికల ఓటమి అనేది ఎంతటి అగ్రనేతలకైనా ఐదేళ్ల పాటు కమ్మేసిన అధికార అహాన్ని దించి, ఒకేసారి కళ్లు తెరిపిస్తుందనేది అక్షరాలా నిజం. నిన్నటివరకు ముఖ్యమంత్రులుగా, పవర్‌ఫుల్ మంత్రులుగా చక్రం తిప్పిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తుతం ఒకే విధమైన పశ్చాత్తాప ప్రకటనలు చేయడం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాము అధికారంలో ఉన్నప్పుడు పార్టీని, తమను నమ్ముకుని జెండాలు మోసిన గ్రౌండ్ లెవెల్ కార్యకర్తలను తీవ్రంగా నిర్లక్ష్యం చేశామని, వారిని కలవకుండా దూరం పెట్టామని ఇద్దరు నేతలూ బహిరంగంగానే అంగీకరిస్తున్నారు. మళ్లీ మమ్మల్ని గెలిపించండి.. భవిష్యత్తులో అన్నీ మీ చేతుల మీదుగానే చేయిస్తాం.. మీరే మా సర్వస్వం అంటూ తాడేపల్లి, తెలంగాణ భవన్ వేదికలుగా క్యాడర్‌కు సరికొత్త హామీలు ఇస్తున్నారు.రాజకీయాల్లో ఇదొక క్లాసిక్ 'సింద్రోమ్'. అధికారం చేతిలో ఉన్నప్పుడు ఇటు జగన్ మోహన్ రెడ్డి కి కేవలం తన కోటరీ నేతలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులే సర్వస్వంగా కనిపించారని పార్టీ నేతలు అంటూంటారు. అటు కేటీఆర్, కేసీఆర్ కూడా ప్రగతి భవన్ దాటి కార్యకర్తల గోడు వినే తీరిక లేకపోయింది. నాడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన అరాచకాలు, అవినీతిని గ్రౌండ్ లెవెల్ కార్యకర్తలు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్దామన్నా కనీసం అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి ఉండేది. కానీ, ఎప్పుడైతే జనం ఈ రెండు పార్టీలకూ ప్రతిపక్ష హోదా ఇచ్చి కూర్చోబెట్టారో.. అప్పుడు వీరికి మళ్లీ కార్యకర్త ' అనే దేవుడు గుర్తొచ్చాడు. కేటీఆర్ నియోజకవర్గాల వారీగా సమీక్షలు పెడుతూ కార్యకర్తలను నిర్లక్ష్యం చేశామని..మరోసారి అలా జరగనివ్వబోమని అంటున్నారు. జగన్ మోహన్ రెడ్డి కూడా నేరుగా ఇదే మాట చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా కార్యకర్తలను ట్రీట్ చేయడం అనేది అన్ని రాజకీయ పార్టీల నైజం. ఓడినప్పుడు నువ్వే నా ప్రాణం అనే లీడర్లు.. గెలవగానే నువ్వెవరో నేను గుర్తుపట్టను అన్నట్లు వ్యవహరిస్తారు. ఇక్కడ లాజికల్‌గా ఆలోచించాల్సిన ప్రశ్న ఒకటి ఉంది. ఒకవేళ భవిష్యత్తులో వీరు మళ్లీ గెలిచి అధికారంలోకి వస్తే.. ఇప్పుడు చెప్తున్నట్లు అన్నీ కార్యకర్తల చేతుల్లోనే పెట్టగలరా? అంటే అది ముమ్మాటికీ అసాధ్యం, కేవలం ఒక మాయమాట మాత్రమే. ఎందుకంటే, ఏ రాజకీయ పార్టీ అయినా సరే.. క్షేత్రస్థాయి కార్యకర్తలకు, లోకల్ లీడర్లకు పూర్తిస్థాయిలో అధికారాలు బదిలీ చేస్తే, వారు స్థానికంగా చేసే పంచాయితీల వల్లే ప్రభుత్వానికి తీవ్రమైన వ్యతిరేకత వస్తుందని అధినాయకత్వం ఎప్పుడూ భయపడుతుంది. అందుకే, అధికారంలోకి రాగానే లీడర్లు మళ్లీ అధికార యంత్రాంగం ని ఆశ్రయిస్తారు, కార్యకర్తలను గేట్ల అవతలే ఉంచుతారు.దీనికి నిజమైన విరుగుడు.. కేవలం ఎన్నికల ఓటమి తర్వాత సానుభూతి కోసం పశ్చాత్తాప ప్రకటనలు చేయడం కాదు. క్రమశిక్షణతో కూడిన క్యాడర్ మైండ్ సెట్‌ను పార్టీ విధానాల ప్రకారం మొదటి నుంచీ తయారు చేయాలి. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై పోరాడేలా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలే తప్ప.. అధికారాన్ని కేవలం ప్రత్యర్థులపై పగ సాధింపు కోసమో, వ్యక్తిగత సంపాదన కోసమో వాడుకునేలా క్యాడర్‌ను రెచ్చగొట్టకూడదు. ఎప్పుడైతే పార్టీ సిద్ధాంతాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తారో.. అప్పుడు పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో వీగిపోతాయి, ఓడిపోయాక ఇలాగే లెంపలేసుకోవాల్సి వస్తుందని ఇటీవల పరిణామాలు గుర్తు చేస్తున్నాయి. జగన్, కేటీఆర్ లాంటి అగ్రనేతలు చేస్తున్న ఈ కార్యకర్తల జపం కేవలం ప్రస్తుతం చెల్లాచెదురవుతున్న తమ ఓటు బ్యాంకును, వలసపోతున్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు వేస్తున్న రాజకీయ ఎత్తుగడ . కేవలం మాటలతో కాకుండా నిజంగానే పార్టీ నిర్మాణాన్ని మార్చి, ద్వితీయ శ్రేణి నాయకత్వానికి సరైన గౌరవం ఇస్తేనే.. రాబోయే ఎన్నికల్లో ఈ పశ్చాత్తాప ప్రకటనలకు కనీస మైలేజ్ లభిస్తుందని అనని రాజకీయ పార్టీల కార్యకర్తల భావన. ఇది వైసీపీ, బీఆర్ఎస్ సమస్య కాదు. అన్నిపార్టీలది. అందరూ నేర్చుకోవాల్సిందే.

# కాంగ్రెస్ లో యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు చిచ్చు

నల్గొండ, జూలై 4, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు నియామక వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. బుధవారం ప్రభుత్వం ప్రకటించిన ఈ బోర్డు నియామకాలు పార్టీ అంతర్గత విభేదాలను ఒక్కసారిగా రోడ్డుపైకి తెచ్చాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా సీనియర్ నేతలను, పార్టీ సొంత క్యాడర్‌ను సంప్రదించకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలపై గాంధీభవన్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారం చివరకు న్యూఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి అధికారిక ఫిర్యాదుల రూపంలో చేరడం గమనార్హం. ఈ నియామకాలపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏకంగా ఒక టీవీ ఛానల్ లైవ్ లోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాకు సంబంధించిన ఎమ్మెల్యేలను, కీలక నేతలను కనీసం సంప్రదించకుండా ప్రభుత్వం ఈ బోర్డును ఎలా ఖరారు చేస్తుందని ఆయన బహిరంగంగానే తప్పుపట్టారు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ జెండా మోసిన ఒరిజినల్ కాంగ్రెస్ నేతలకు ప్రాధాన్యత లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో హాట్ టాపిక్‌గా మారాయి. మరోవైపు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను సైతం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయలేదనే ప్రచారం జరుగుతోంది. దేవాలయాల వ్యవహారాలతో నేరుగా సంబంధం ఉండే అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కూడా సంప్రదించకుండానే ఈ జాబితాను ఖరారు చేశారని, దేవాదాయ శాఖ మంత్రిని పక్కనబెట్టడం వల్లే ఈ వివాదం మరింత ముదిరిందని కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది. ప్రభుత్వం, పార్టీల మధ్య కనీస సమన్వయం లోపించిందనే దానికి ఈ పరిణామాలే నిదర్శనమని విమర్శకులు అంచనా వేస్తున్నారు.

ట్రస్ట్ బోర్డులో వినోద్ వెంకటస్వామిని చేర్చడంపై పార్టీ శ్రేణుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వారి కుటుంబంలో వివేక్ వెంకటస్వామికి కీలక పదవులు ఉండటం, ఆయన కొడుకు ఎంపీగా విజయం సాధించడం గమనార్హం. ఇలాంటి తరుణంలో మళ్లీ అదే కుటుంబానికి చెందిన వినోద్ వెంకటస్వామికి పవిత్రమైన యాదగిరిగుట్ట బోర్డులో స్థానం కల్పించడం ఏంటని, పార్టీ కోసం రక్తం చిందించిన ఇతర సీనియర్లను ఎందుకు విస్మరించారని కొందరు నేతలు ప్రశ్నిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, మాజీ బీఆర్ఎస్ ఎంపీ సోదరుడైన సత్యనారాయణ రెడ్డిని ఈ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా నియమించడంపై కాంగ్రెస్ పాతకాపులు భగ్గుమంటున్నారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన నాయకులను పక్కనబెట్టి, నిన్నగాక మొన్న పార్టీ మారిన వారికి, బీఆర్ఎస్ నేపథ్యం ఉన్నవారికి ఇలాంటి ఉన్నతమైన, ప్రతిష్టాత్మకమైన పదవులు కట్టబెట్టడం ఏంటనే ఆవేదన పార్టీ క్యాడర్‌లో వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రముఖ నటుడు చిరంజీవి భార్య కొణిదెల సురేఖను బోర్డు మెంబర్‌గా నియమించడం రాజకీయంగా సరికొత్త వివాదానికి దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌తో బలమైన మూలాలు, సంబంధాలు ఉన్న ఆమెను తెలంగాణలోని అత్యంత పవిత్రమైన, ప్రతిష్టాత్మకమైన ఆలయ బోర్డులో ఎలా నియమిస్తారంటూ సోషల్ మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికతను, తెలంగాణ సెంటిమెంట్‌ను దెబ్బతీసేలా ఈ నిర్ణయం ఉందంటూ కొందరు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్షాలకు ఆయుధంగా మారేలా ఈ నియామకం ఉందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు నియామకాల వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌లో పెద్ద చిచ్చే పెట్టింది.

అసంతృప్త నేతలకు పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో రేగిన మంటలు చల్లారేలా కనిపించడం లేదు. మరి ఈ అంతర్గత సంక్షోభాన్ని ప్రభుత్వం, పార్టీ పెద్దలు ఎలా సర్దుబాటు చేస్తారో వేచి చూడాలి.

# 19 జిల్లాల్లో పత్తి విత్తనాలు ఫ్రీ

నల్గొండ జూలై 4,తెలంగాణలో పత్తి రైతులకు శుభవార్త.. ఉచితంగా విత్తనాల పంపిణీ ప్రారంభమైంది. జాతీయ ఉత్పాదకత పథకంలో 19 జిల్లాల ఎంపిక చేయగా.. రైతు వేదికల్లో పంపిణీ చేయనున్నారు. రైతులకు విత్తనాలతో పాటుగా ప్లాంట్ గ్రోత్ నియంత్రకాలు, మందులు కూడా ఇస్తారు. కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం భరించి సబ్సిడీపై ఈ విత్తనాలను ఉచితంగా రైతులకు ఇస్తున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని 19 జిల్లాల రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఎంసీపీ (జాతీయ పత్తి ఉత్పాదకత పథకం) ఉచితంగా నోటిఫైడ్ బీటీ హైబ్రిడ్ పత్తి విత్తనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రైతులకు పంపిణీ చేయనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఎంసీపీ పథకం కింద ప్రతిపాదనలు పంపగా.. పత్తి ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచే దిశగా 19 జిల్లాలను విత్తనాల పంపిణీ కోసం ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ కోదండరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డిలు అధికారులతో కలిసి పత్తి విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశారు.

రాష్ట్రంలోని 19 జిల్లాల్లో విత్తనాలు పంపిణీ ప్రారంభిస్తారు. రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ, ఖమ్మం, జనగామ, వరంగల్, నారాయణపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, జోగులాంబ గద్వాల, కరీంనగర్, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని రైతు వేదికల్లో విత్తనాలను పంపిణీ చేస్తారు. ఈ మేరకు రైతులు పత్తి విత్తనాల పంపిణీ విషయాన్ని గమనించాలి.రాష్ట్ర విత్తన సరఫరా సంస్థ ద్వారా ఈ 19 జిల్లాలో ఒక్కో రైతుకు గరిష్ఠంగా 2.5 ఎకరాల చొప్పున విత్తనాలు పంపిణీ చేస్తారు. ఈ లెక్కన చూస్తే మొత్తం 1,27,374 ఎకరాలకు సంబంధించి 50,950 మంది రైతులకు 6.33 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలను అందజేయనున్నారు. ఈ పత్తి విత్తనాలకు సంబంధించి.. కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం చొప్పున మొత్తం రూ.57.02 కోట్ల సబ్సిడీని భరిస్తున్నాయి. రైతులకు పత్తి విత్తనాలతో పాటుగా ప్లాంట్ గ్రోత్ నియంత్రకాలు, వేప నూనె వంటి మందులను రాయితీపై రైతులకు అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఎస్ఓసీఏ (సీడ్, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అథారిటీ)లో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. మొత్తం 19 సీడ్ సర్టిఫికేషన్ అధికారుల పోస్టుల భర్తీ కోసం టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 7 నుంచి ఆగస్టు 12 వరకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్‌లో రాతపరీక్ష ఉంటుంది. ఈ ఉద్యోగాల కోసం అభ్యర్థుల వయోపరిమితి 18-44 ఏళ్లు ఉండాలని నిర్ణయించారు. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకునేవారు ఐసీఏఆర్ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి అగ్రికల్చర్‌లో డిగ్రీ, సీడ్ టెక్నాలజీ, ప్లాంట్‌బ్రీడింగ్, అగ్రోనామి, ప్లాంట్ సైకాలజీలో పీజీ అగ్రికల్చర్ చదివి ఉండాలని టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొంది. టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయి.

# నగదు చోరీ కేసును 48 గంటల్లో ఛేదించిన పోలీసులు

నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నగదు చోరీ కేసును పోలీసులు 48 గంటల్లో ఛేదించారు. అమిత్ అగర్వాల్ ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి దొంగిలించిన రూ.7.70 లక్షల నగదును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. నారాయణగూడ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుల్తాన్ బజార్ డివిజన్ ఏసీపీ ఎం.మట్టయ్య హిమాయత్‌నగర్ ఇన్ స్పెక్టర్ ఎం.సైదేశ్వర్ తో కలసి వివరాలు వెల్లడించారు. నిందితుడు జోధ్‌పూర్(రాజస్థాన్)కు చెందిన దీపేష్ ఖతీ(19), ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని ఓల్డ్ బోయిన్ పల్లిలో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. అవంతి నగర్ లోని అమిత్ అగర్వాల్ ఇంటిలో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో సుమారు రూ.7.70 లక్షల నగదును తన భార్య హ్యాండ్‌బ్యాగులు, లేడీస్ పర్సుల్లో ఉంచి మొదటి అంతస్తులోని బెడ్‌రూమ్‌లో ఉన్న చెక్క అల్మారాలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. జూన్ 30 ఉదయం నగదు సురక్షితంగానే ఉన్నట్లు నిర్ధారించుకున్న ఆయన భార్య ఈవెనింగ్ వాక్ కు వెళ్లే సమయంలో బెడ్‌రూమ్ తలుపుకు తాళం వేయకుండా వెళ్లింది. ఆ సమయంలో ఇంటిలో వివిధ అంతస్తుల్లో పనివాళ్లు పనిచేస్తున్నారు. రాత్రి తిరిగి పర్సులను తనిఖీ చేయగా నగదు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఇంట్లో పనిచేస్తున్న వ్యక్తుల్లో ఎవరైనా నగదును దొంగిలించి ఉండవచ్చని అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీల పరిశీలన, సాక్ష్యాల సేకరణ, ఇంట్లో పనిచేసిన కార్మికుల విచారణతో పాటు సాంకేతిక ఆధారాలపై దృష్టి సారించారు. సీసీటీవీ కెమెరాల్లో నిందితుడు దీపేష్ కదలికలపై అనుమానం రావడంతో , పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. శుక్రవారం బోయిన్‌పల్లిలోని నిందితుడి గదిపై దాడి చేసి, దొంగిలించిన రూ.7.70 లక్షల నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. దొంగతనం చేసిన తరువాత ఎవరికి అనుమానం రాకుండా , యధావిధిగా పనికి వచ్చాడని , నాలుగు రోజుల తరువాత దొంగిలించిన డబ్బులతో రాజస్థాన్ వెళ్లిపోయేందుకు ప్లాన్ చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

## ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్ దగ్గర భారీగా రేషన్ బియ్యం పట్టివేత

సంగారెడ్డి ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 3 వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఎస్వోటీ పోలీసులు తనిఖీలు జరిపారు. 32.700 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. హైదరాబాద్ కాటేదాన్ నుంచి గుజరాత్ రాష్ట్రం కు తరలిస్తుండగా పట్టివేసారు. బియ్యం లారీని స్థానికంగా ఉన్న శ్రీరామ్ గోదాంకు తరలించారు.

# క్యాంపు కార్యాలయాలు కథేంటీ

హైదరాబాద్, జూలై 4, తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ పార్టీ మధ్య రాజకీయ వైరం రోజురోజుకు ముదిరి పాకాన పడుతోంది. రేవంత్ విమర్శలు చేయడం.. భారత రాష్ట్ర సమితి నాయకులు ప్రతి విమర్శలు చేయడం.. పోటాపోటీగా సవాళ్లు విసురుకోవడం.. ఇలా ఈ రెండు పార్టీల మధ్య రాజకీయ వివాదం సాగుతోంది. రేవంత్ రెడ్డి క్యాంప్ ఆఫీసుల వ్యవహారం రాజకీయ, అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ముఖ్యమంత్రులు సచివాలయం నుంచి పనిచేస్తారు. వెసులుబాటు కోసం క్యాంప్ ఆఫీస్‌లు ఏర్పాటు చేసుకుంటారు. సహజంగా ఇంటినే క్యాంప్ ఆఫీస్‌గా మార్చుకున్న ముఖ్యమంత్రులు అనేక మంది ఉన్నారు. కానీ.. రేవంత్ రెడ్డి ఏకంగా ఐదు క్యాంపు కార్యాయాలయాలు ఏర్పాటు చేసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రధాన మంత్రి మోదీకి సైతం ఇన్ని క్యాంపు కార్యాలయాలు లేవని సీనియర్ అధికారులు గుర్తు చేస్తున్నారు. మోదీకి న్యూ ఢిల్లీలో అధికారిక నివాసంతోపాటు క్యాంప్ కార్యాలయం ఒకటి ఉన్నది. కానీ.. తెలంగాణలో రేవంత్ రెడ్డికి సచివాలయంలో ప్రత్యేక కార్యాలయంతోపాటు.. జూబ్లీహిల్స్ నివాసంలో క్యాంప్ కార్యాలయం ఉంది. ఈ రెండూ కాకుండా జూబ్లీహిల్స్ డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ)లో ఒక కార్యాలయం నిర్మించారు. ఇక బంజారాహిల్స్ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైతం ఒక కార్యాలయం ఏర్పాటు చేశారు. తాజాగా రంగారెడ్డి జిల్లాలో నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలో ఒక కార్యాలయం ఏర్పాటు చేయడం గమనార్హం. అంటే.. మొత్తంగా ఆయనకు ఐదు అధికారిక కార్యాలయాలు ఉన్నాయి.రేవంత్ రెడ్డి ఇటీవల కాలంలో భారత రాష్ట్ర సమితి మీద విమర్శల జోరు పెంచారు. ప్రతి సభలోను గణాంకాలతో సహా విమర్శలు చేస్తున్నారు. వీటికి గులాబీ పార్టీలో కీలక నేతగా ఉన్న కేటీఆర్ గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. అయితే ఇటీవల కేటీఆర్ ఒక కీలక ఆరోపణ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని కేటీఆర్ తీవ్రస్థాయిలో ఎండగట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాదాపు 200 కోట్లు ఖర్చుతో కొత్త క్యాంపు కార్యాలయం నిర్మిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే ప్రగతిభవన్ ఉందని.. అది అందుబాటులో ఉండగానే రేవంత్ రెడ్డి 200 కోట్లతో కొత్త కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేవలం కొత్త భవనం చుట్టూ రక్షణ గోడ నిర్మించడానికి 19 కోట్లు ఖర్చు పెడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు.. అంతేకాకుండా ముఖ్యమంత్రి తన సతీమణితో కలిసి కొత్త భవనంలోకి అర్ధరాత్రి పూట గృహప్రవేశం చేశారని కేటీఆర్ ఆరోపించారు. అంత అర్ధరాత్రి పూట దొంగచాటుగా వెళ్లాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు.గతంలో కూడా గులాబీ పార్టీకి అనుకూలంగా పనిచేసే సోషల్ మీడియా విభాగాలు రేవంత్ రెడ్డి నిర్మిస్తున్న భవనానికి సంబంధించిన ఫోటోలను బయటపెట్టాయి. అప్పట్లో కూడా గులాబీ పార్టీ రేవంత్ రెడ్డి నిర్మిస్తున్న భవనం మీద విమర్శలు చేసింది. అసలు ఎందుకు ఈ స్థాయిలో భవన నిర్మించాలో చెప్పాలని డిమాండ్ చేసింది.

మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావుకు కూడా ఇన్ని క్యాంప్ కార్యాలయాలు అప్పట్లో లేవని సీనియర్ అధికారులు అంటున్నారు. ఆయనను మించి రేవంత్ రెడ్డి క్యాంప్ ఆఫీసులను ఏర్పాటు చేసుకుంటున్నారని పేర్కొంటున్నారు. ఆయన వెసులుబాటు రీత్యా ఎక్కడికక్కడ క్యాంపు కార్యాలయాలు పెట్టుకున్నా.. అక్కడి సమీక్షలకు వెళ్లటానికి సీనియర్ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రేవంత్ రెడ్డి ఏ పూట ఎక్కడ ఉంటారు? ఏ సమావేశం ఎక్కడ పెడతారు? అనే ఆదుర్దాను.. ఉన్నతాధికారులతో పాటు ఆయనను కలవాలనుకునే నాయకులు సైతం నిత్యం ఎదుర్కొంటున్నారని సీనియర్ అధికారుల చర్చించుకుంటున్నారు. ఎక్కడ సమీక్ష ఉంటే అక్కడికి అధికారులు కట్టగట్టుకుని పోవాల్సి వస్తున్నదని అంటున్నారు. పైగా నిత్యం ఈ కార్యాలయాల్లో మెయింటనెన్స్ సైతం ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఇన్ని బదులు.. సచివాలయం లేదా అధికారిక క్యాంప్ కార్యాలయంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తే ప్రభుత్వ నిధుల ఆదాతో పాటు మంత్రులు, ఉన్నతాధికారుల సమయం ఆదా అవుతుందని ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వ్యాఖ్యానించారు.

## మోదీకి రెండే కార్యాలయాలు..

న్యూఢిల్లీ రైసినా హిల్స్ సేవాతీర్థ్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అధికారిక కార్యాలయం ఉంది. లోక కళ్యాణ్ మార్గ్‌లో ప్రధాన మంత్రి అధికారిక నివాసం (క్యాంప్ ఆఫీసు) ఉంది. ఈ రెండు తప్ప అదనంగా ఆయనకు ఎక్కడా కార్యాలయాలు లేవు. తెలంగాణకు రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కే చంద్రశేఖర్ రావుకు కూడా సచివాలయం ఆరో అంతస్తులో కార్యాలయం ఉంది. బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ (ప్రగతి భవన్) అధికారిక నివాసం ఉండేది. తన పదవీకాలంలో సచివాలయం బదులు ఎక్కువగా ప్రజా భవన్‌లోనే మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఉండేవారు. ఇది సచివాలయానికి సమీపంలో ఉండటంతో ఉన్నతాధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులకు అంతగా ఇబ్బంది ఉండేది కాదని ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వ్యాఖ్యానించారు. మిగతా సమయం ఎక్కువగా సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో గడిపేవారు.కేసీఆర్ వ్యవహార శైలిపై గడీల పాలన అంటూ విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత సచివాలయానికి వస్తారని చాలా మంది అధికారులు భావించారు. కానీ దానికి భిన్నంగా పరిస్థితులు ఉన్నాయన్న చర్చలు వినిపిస్తున్నాయి. అది కూడా ఏకంగా ఐదు కార్యాలయాల నుంచి విధులు నిర్వహిస్తుండటంపై రాజకీయ పరిశీలకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలోని ఆరో అంతస్తులో సీఎం రేవంత్ రెడ్డికి కార్యాలయంతోపాటు.. సీఎంవో అధికారులకు ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేశారు. కానీ.. మంత్రివర్గ సమావేశాలు ఉన్నప్పుడు తప్ప ఇతర సమయాల్లో సీఎం సచివాలయానికి రావడం లేదు. మరో విశేషం ఏమిటంటే.. కనీసం వారానికి ఒకటి రెండుసార్లు కూడా రాకపోయినా.. ఆరో అంతస్తులో సాధారణ పౌరులు, మీడియా ప్రతినిధులకు ప్రవేశాన్ని నిషేధించడంపై మీడియా వర్గాల్లో తరచూ చర్చ సాగుతోంది. ముందస్తు అనుమతులు ఉంటే తప్ప ప్రవేశం లేకుండా చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సీ బ్లాక్‌లో సీఎం కార్యాలయానికి ప్రజా ప్రతినిధులు, సాధారణ పౌరులు, అధికారులు, మీడియా ప్రతినిధులు వెళ్లి వస్తుండేవారు. కానీ.. ఇప్పుడు అటు వైపు వెళ్లడం అసాధ్యంగా మారింది.

## మాజీ సీఎం కేసీఆర్ బాటలోనే రేవంత్ రెడ్డి?

నూతన సచివాలయం నిర్మాణం చేసిన తరువాత కేసీఆర్ హయాంలో అమలు అయిన విధానాలనే రేవంత్ రెడ్డి కూడా కొనసాగిస్తుండటంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ ప్రజలే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులు సైతం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాలో గడీల పాలన, నియంత, ఫామ్‌హౌస్ సీఎం అని పలు రకాలుగా విమర్శించి మనం చేస్తున్నది ఏమిటి? అంటూ పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతర్గత సంభాషణల్లో మండిపడుతున్నారు. ప్రగతి భవన్ ముందు రోడ్డుపై ఉన్న ఇనుప కంచెను బద్దలు చేశామని చెప్పుకొంటున్న రేవంత్ రెడ్డి? సచివాలయం, మిగతా కార్యాలయాల్లో చేస్తున్నదేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ముఖ్యమంత్రిగా మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. అలా కాకుండా ఏ రోజు ఏ సమయంలో ఎక్కడ ఉంటారో తెలియని పరిస్థితిని తీసుకువచ్చారనే అభిప్రాయాలు ఐఏఎస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఒకరోజు పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, మరో రోజు ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్, జూబ్లీహిల్స్ అధికారిక నివాసంలో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే పరిపాలన కొనసాగిస్తే గత సీఎం కేసీఆర్ మాదిరి అపఖ్యాతి పాలు కావడం ఖాయమని, ప్రజలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితి ఎదురవుతుందని నాయకులు వాపోతున్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా క్యాంప్ కార్యాలయాల పై స్పష్టమైన నిర్ణయం తీసుకుని అందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరుతున్నారు.మళ్లీ ఇప్పుడు కేటీఆర్ రంగంలోకి దిగి గృహప్రవేశం చేశారని రేవంత్ రెడ్డి మీద ఆరోపణలు చేసిన నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా కౌంటర్ ఇస్తుందో చూడాలి. ఒకవేళ భవనం నిర్మించకపోతే కాంగ్రెస్ పార్టీ ఈ పాటికే ఎదురుదాడి చేసేది. కానీ కాంగ్రెస్ పార్టీ నిశ్శబ్దంగా ఉందంటే ఏదో జరుగుతోందనే అనుకోవాలని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# సాగర్ చుట్టూ స్కైవాక్....

హైదరాబాద్, జూలై 4, హైదరాబాద్ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు దాని చుట్టూ సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని నిర్ణయించింది. స్కైవాక్ ద్వారా బుద్ధుడి విగ్రహాన్ని కొత్త కోణంలో వీక్షించే అవకాశం కల్పించనుంది. అదే సమయంలో నాగార్జునసాగర్ బుద్ధవనం, ఫణిగిరి, నేలకొండపల్లి వంటి బౌద్ధ క్షేత్రాలను అభివృద్ధి చేసి ప్రత్యేక టూరిజం ప్యాకేజీలు తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.హైదరాబాద్ ప్రజలకు, పర్యాటక ప్రేమికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగరంలోని హుస్సేన్‌సాగర్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ కీలక అడుగు వేస్తోంది. ఇప్పటికే బోటింగ్ సౌకర్యంతో సందర్శకులను ఆకట్టుకుంటున్న హుస్సేన్‌సాగర్‌కు మరింత ప్రత్యేక ఆకర్షణను జోడిస్తూ సరస్సు చుట్టూ ఆధునిక సర్క్యులర్ స్కైవాక్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ స్కైవాక్ ద్వారా సందర్శకులు హుస్సేన్‌సాగర్ మధ్యలోని ప్రపంచ ప్రసిద్ధ ఏకశిల బుద్ధ విగ్రహాన్ని సరికొత్త కోణంలో వీక్షించే అవకాశం పొందనున్నారు. సాయంత్ర వేళల్లో సరస్సు అందాలు, నగర వెలుగులు, బుద్ధ విగ్రహం ఒకే వేదికపై కనిపించేలా ఈ ప్రాజెక్టును రూపొందించనున్నట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ టూరిజానికి మరో కొత్త గుర్తింపు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ఇదే సమయంలో నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని కూడా అంతర్జాతీయ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అక్కడ అంతర్జాతీయ బుద్ధ మ్యూజియం, హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.

# పాలమూరు బ్రహ్మోస్ యూనిట్ మూడు గ్రామాల్లో భూమి గుర్తింపు

మహబూబ్ నగర్, జూలై 4(న్యూస్ పల్స్)రక్షణ రంగ తయారీలో తెలంగాణకు మరో భారీ అవకాశం తలుపు తడుతోంది. ప్రపంచంలోని వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల్లో ఒకటైన బ్రహ్మోస్‌కు సంబంధించిన తయారీ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసే ప్రతిపాదనపై కదలికలు మొదలైనట్లు సమాచారం. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల సమీపంలో సుమారు 416 ఎకరాల భూమిని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు లభిస్తే, ఇది కేవలం పాలమూరు పారిశ్రామిక ముఖచిత్రాన్నే కాకుండా తెలంగాణ రక్షణరంగ వ్యవస్థలో భారీ మార్పులు తెచ్చే పెద్ద పెట్టుబడిగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు వ్యవసాయం, వలసలు, సాధారణ పరిశ్రమల చర్చలకే పరిమితమైన పాలమూరు ప్రాంతం.. రక్షణ తయారీ రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే అవకాశాన్ని ఈ ప్రతిపాదన తెచ్చిపెట్టింది. బ్రహ్మోస్ వంటి అత్యంత సున్నితమైన రక్షణ తయారీ ప్రాజెక్టులకు భద్రత, భూమి లభ్యత, రోడ్డు కనెక్టివిటీ, విమానాశ్రయానికి చేరువ, ఇప్పటికే ఉన్న సాంకేతిక పర్యావరణం వంటి అంశాలు కీలకం. దేవరకద్ర ఈ కోణాల్లో అనుకూలంగా ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ప్రతిపాదిత స్థలం జాతీయ రహదారి 44కి సమీపంలో ఉంది. హైదరాబాద్‌ను బెంగళూరుతో కలిపే ఈ మార్గం దేశంలో అత్యంత ముఖ్యమైన రవాణా కారిడార్లలో ఒకటి. అలాగే శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉండటం కూడా లాజిస్టిక్స్ పరంగా ( ఎ యా జ న క ం ం గా భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు సంబంధించిన సంస్థలు ఇప్పటికే బలంగా ఉన్నాయి. ప్రత్యేకించి డిఆర్?డిఎల్? పక్కన ఇప్పటికే బ్రహ్మోస్? ఇంటెగ్రేషన్? కాంప్లెక్స్? ఉంది. ఇక్కడ క్షిపణులకు వివిధ వ్యవస్థలతో అనుసంధానించే పని జరుతుంది. అదేకాకుండా, ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్, మిధాని, ఊంఒ కార్యకలాపాలు, ప్రైవేట్ ఏరోస్పేస్ కంపెనీలు తెలంగాణకు బలమైన పునాది కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు దగ్గరగా, విస్తారమైన భూమి అందుబాటులో ఉండే మహబూబ్‌నగర్‌ను విస్తరణ కేంద్రంగా చూడవచ్చన్న అభిప్రాయం ఉంది. దేవరకద్ర మండలంలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి, జీనుగురాల పరిసరాల్లో భూమిని పరిశీలించినట్లు తెలుస్తోంది. పరిశ్రమల శాఖ స్థాయిలో భూమి గుర్తింపు, ప్రాథమిక సౌకర్యాల పరిశీలన, ప్రాజెక్టు అనుకూలతపై కసరత్తు జరిగినట్లు సమాచారం. భూమి సుమారు 400 నుంచి 416 ఎకరాల మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. రక్షణ తయారీ యూనిట్‌కు ప్రధాన ఉత్పత్తి ప్రాంతం మాత్రమే కాకుండా, పరీక్షలు, నిల్వ, భద్రతా వలయం, రవాణా సౌకర్యాలు, అనుబంధ పరిశ్రమల కోసం కూడా విస్తారమైన స్థలం అవసరం అవుతుంది. అందుకే ఇలాంటి ప్రాజెక్టులకు పెద్ద భూప్రాంతం అవసరం అవుతుంది. అయితే ఈ దశలో ప్రాజెక్టు ఇంకా ప్రతిపాదన, స్థల పరిశీలన, అనుమతుల దశలోనే ఉంది. కేంద్ర రక్షణ శాఖ, బ్రహ్మోస్ ఏరోస్పేస్ రాష్ట్ర ప్రభుత్వం స్థాయిల్లో తుది నిర్ణయాలు పూర్తయ్యాకే నిర్మాణంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బ్రహ్మోస్ యూనిట్ ప్రతిపాదనతో తెలంగాణ రక్షణ తయారీ పటంలో మరింత ప్రాధాన్యం పొందే అవకాశం. బ్రహ్మోస్ అనేది భారత్?రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థ. భారత , రష్యాకు చెందినజీ భాగస్వామ్యంతో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఏర్పడింది. బ్రహ్మపుత్ర, మోస్క్వా నదుల పేర్ల నుంచి 'బ్రహ్మోస్' అనే పేరు వచ్చింది. ఈ క్షిపణిని భూమి, సముద్రం, గగనం, జలాంతర్గామి వేదికల నుంచి ప్రయోగించవచ్చు. వేగం, ఖచ్చితత్వం, వివిధ వేదికల నుంచి ప్రయోగించగల సామర్థ్యం కారణంగా బ్రహ్మోస్ భారత రక్షణ వ్యవస్థలో కీలకమైన ఆయుధంగా గుర్తింపు పొందింది. ఇటీవలి సంవత్సరాల్లో బ్రహ్మోస్ కేవలం భారత సైనిక సామర్థ్యానికే కాకుండా, రక్షణ ఎగుమతులకూ ముఖ్యమైన ఉత్పత్తిగా మారింది. ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ వ్యవస్థల ఎగుమతి ఒప్పందం తర్వాత, ఈ క్షిపణి అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా భారత తయారీ సామర్థ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రస్తుతం యూఏఈ కూడా ఈ వ్యవస్థను కొనుగోలు చేయాలనే ఆసక్తితో ఉందనే వార్తలు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బ్రహ్మోస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీఇప్పటికే ప్రారంభమైంది. ఆ యూనిట్‌లో అసెంబ్లీ, ఇంటిగ్రేషన్, టెస్టింగ్ వంటి కీలక ప్రక్రియలు జరుగుతున్నాయి. లక్నో యూనిట్ ప్రారంభం తర్వాత బ్రహ్మోస్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, సరఫరా గొలుసును బలపరచడం, దేశీయ రక్షణ తయారీని విస్తరించడం వంటి అంశాలపై కేంద్రం దృష్టి పెట్టింది. తెలంగాణలో కొత్త యూనిట్‌పై చర్చలు జరగడం సహజమైన పరిణామంగా పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న రక్షణ, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, మెటీరియల్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ సామర్థ్యాలు ఈ ప్రతిపాదనకు బలం చేకూరుస్తున్నాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం ఈ ప్రాజెక్టుకు ప్రారంభ దశలో సుమారు ?500 కోట్ల పెట్టుబడి రావొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రక్షణ తయారీ యూనిట్‌లు సాధారణ పరిశ్రమల కంటే భిన్నంగా ఉంటాయి. భద్రతా ప్రమాణాలు, నాణ్యత పరీక్షలు, ప్రత్యేక పరికరాలు, అధునాతన తయారీ సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం అవుతాయి. ఈ యూనిట్ ఏర్పడితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 నుంచి 2,000 ఉద్యోగాలు రావొచ్చని అంచనా. తయారీ, ఇంజినీరింగ్, నాణ్యత నియంత్రణ, లాజిస్టిక్స్, భద్రత, మెయింటెనెన్స్, పరిపాలన, అనుబంధ సేవల రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడే వీలుంది. దీంతో పాటు చిన్న, మధ్య తరహా అనుబంధ పరిశ్రమలకు కూడా కొత్త అవకాశాలు తెరుచుకోవచ్చు. రక్షణ తయారీ రంగంలో ఒక్క ప్రధాన యూనిట్ వచ్చినా, దానికి సరఫరా చేసే భాగాలు, సామాగ్రి, పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ప్యాకేజింగ్, రవాణా వంటి రంగాల్లో స్థానిక వ్యాపారాలకు అవకాశం పెరుగుతుంది. మహబూబ్‌నగర్ జిల్లా చాలా కాలంగా వలసల జిల్లాగా గుర్తింపు పొందింది. సాగునీటి ప్రాజెక్టులు, రోడ్డు కనెక్టివిటీ, హైదరాబాద్‌కు చేరువ, కొత్త పెట్టుబడులతో ఈ ప్రాంతం గత కొన్నేళ్లుగా మార్పు దశలో ఉంది. బ్రహ్మోస్ వంటి హై-టెక్ రక్షణ తయారీ యూనిట్ ఇక్కడికి వస్తే, అది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు.. ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మలుపు అవుతుంది. దేవరకద్ర పరిసరాల్లో మౌలిక వసతులు మెరుగుపడే అవకాశం ఉంది. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, భద్రతా వ్యవస్థలు, కార్మికులకు నివాసాలు, శిక్షణా కేంద్రాలు, విద్యా సంస్థలు, చిన్న వ్యాపారాలు పెరగొచ్చు. హోటళ్లు, రవాణా, రియల్ ఎస్టేట్, సేవా రంగాలకూ దీని ప్రభావం ఉండే అవకాశం ఉంది.

**తెలంగాణకు డిఫెన్స్ క్లస్టర్ అవకాశం**

తెలంగాణ ఇప్పటికే దేశంలోని ముఖ్యమైన ఏరోస్పేస్, డిఫెన్స్ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. హైదరాబాద్ పరిసరాల్లో డీఆర్డీఓ ల్యాబ్స్, బీడీఎల్, మిధానీ, ఈసీఐఎల్,హెచ్ ఏఎల్ కార్యకలాపాలు, అంతర్జాతీయ ఏరోస్పేస్ సంస్థల భాగస్వామ్యాలు ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో కూడా ప్రెసిషన్ ఇంజినీరింగ్, డ్రోన్స్, ఏరోస్ట్రక్చర్స్, రక్షణ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో సంస్థలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ యూనిట్ ఏర్పడితే, హైదరాబాద్‌కు దక్షిణంగా కొత్త రక్షణ తయారీ వలయం ఏర్పడే అవకాశం ఉంది. హైదరాబాద్?మహబూబ్‌నగర్?బెంగళూరు మార్గం భవిష్యత్తులో డిఫెన్స్, ఏరోస్పేస్ తయారీకి మరింత కీలకంగా మారవచ్చు. అయితే ఈ ప్రాజెక్టు అమలు విషయంలో ఇంకా కీలక దశలు మిగిలే ఉన్నాయి. భూమి బదలాయింపు, పర్యావరణ అనుమతులు, భద్రతా అనుమతులు, కేంద్ర రక్షణ శాఖ ఆమోదం, బ్రహ్మోస్ ఏరోస్పేస్ తుది నిర్ణయం వంటి అంశాలు పూర్తయ్యాకే ప్రాజెక్టు నిర్మాణ దశకు వెళ్లే అవకాశం ఉంటుంది. రక్షణ రంగ ప్రాజెక్టులు సాధారణ పరిశ్రమల మాదిరిగా వేగంగా ప్రకటించి వెంటనే ప్రారంభించే విధంగా ఉండవు. భద్రత, వ్యూహాత్మక అవసరాలు, సరఫరా వ్యవస్థ, భూమి స్థితి, సాంకేతిక అవసరాలు అన్నీ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ముందడుగు పడుతుంది. ప్రతిపాదన తుది ఆమోదం పొందితే, ఇది తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. ఒకవైపు రాష్ట్రానికి భారీ పెట్టుబడి, మరోవైపు పాలమూరుకు ఉపాధి అవకాశాలు, ఇంకోవైపు దేశ రక్షణ తయారీ సామర్థ్యానికి కొత్త బలం లభించవచ్చు. హైదరాబాద్ ఇప్పటికే సాంకేతిక, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో బలమైన స్థానం సంపాదించింది. ఇప్పుడు ఆ బలం మహబూబ్‌నగర్ దిశగా విస్తరిస్తే, తెలంగాణ రక్షణ తయారీ పటంలో మరింత స్పష్టంగా కనిపించే రోజు దూరంలో ఉండకపోవచ్చు

## రాష్ట్రంలో వరల్డ్ క్లాస్ స్పోర్ట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

**జెఎస్ డబ్ల్యు సంస్థ సహకారంతో ఏర్పాటు చేస్తాం**
**క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకచర్యలు చేపడుతున్నాం**
**క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 3శాతం రిజర్వేషన్**
**ఎలైట్ ప్లేయర్స్ తో మంత్రి లోకేష్ విందు సమావేశం**

అమరావతి: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు జెఎస్ డబ్ల్యు సంస్థ ముందుకు వచ్చిందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. కామన్ వెల్త్, ఆసియా గేమ్స్ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన ఎలైట్ ప్లేయర్స్ తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉండవల్లి నివాసంలో శుక్రవారం రాత్రి డిన్నర్ మీట్ నిర్వహించారు. ఆద్యంతం ఆహ్లాదంగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై క్రీడాకారుల నుంచి సలహాలను స్వీకరించారు. క్రీడాకారుల కుటుంబ నేపథ్యం, ప్రారంభంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అందుతున్న ప్రోత్సాహం వంటి వాటిపై క్రీడాకారులను వాకబుచేశారు. పలువురు క్రీడాకారులు మాట్లాడుతూ... గతంలో ఆంధ్రప్రదేశ్ లో మంచి కోచ్ లు ఉండేవారని, 2019లో ప్రభుత్వం మారాక

వారందరినీ తొలగించారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో గుంటూరులో చంద్రబాబుగారు విదేశీ కోచ్ లతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఏర్పాటుచేశారని అన్నారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ... పాలకులు మారినా పాలసీలు మారకూడదన్నారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు ప్రపంచస్థాయి అత్యుత్తమ కోచ్ లను ఏపీలో ఏర్పాటుచేసి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తీసుకొస్తామని అన్నారు. రాష్ట్ర అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాల



కల్పనకు జెఎస్ డబ్ల్యు సంస్థ అంగీకారం తెలిపింది. ఇందుకు అవసరమైన ఫ్రేమ్ వర్క్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియాలో గ్రిఫిత్ యూనివర్సిటీ విద్యతో క్రీడలకు ప్రత్యేక శిక్షణ అందిస్తోందని తెలిపారు. అక్కడ కరిక్యులమ్‌ను అథ్లెటిక్స్‌కు అనుగుణంగా రూపొందించారని అన్నారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని మంత్రి లోకేష్

పేర్కొన్నారు. స్పోర్ట్స్ ట్రైనింగ్ అండ్ ఎడ్యుకేషన్ పై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్ తో పాటు ఇతర క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి తాము పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ ఎరెనా ఉండాలన్నది తమ అభిమతంగా పేర్కొన్నారు. స్పోర్ట్స్ ను ప్రోత్సహించడంపై తల్లిదండ్రుల్లో కూడా అవేర్ నెస్ రావాల్సి ఉందని అన్నారు. ఇందులో భాగంగానే గతఏడాది నిర్వహించిన డీఎస్సీలో తొలిసారిగా క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ అమలుచేశామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని అన్నారు. విశాఖ క్రికెట్ స్టేడియంలో ఒక స్టాండ్ కు భారత మహిళా క్రికెట్

జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్ పేరుపెట్టామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి శనివారం నో బ్యాగ్ డేగా ప్రకటించి విద్యార్థుల ఆసక్తిమేరకు వారిని క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



**జహీరాబాద్, జూలై 4 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో శనివారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం కింద చీరలను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ పాల్గొని లబ్ధిదారులకు చీరలు అందజేశారు. పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి పథకం అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జహంగీర్, మెప్మా సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం...

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు:టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ చేసిన సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ చౌరస్తాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాలాభిషేకం చేశారు, అనంతరం ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, రైతులకు సకాలంలో రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ అంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్, సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, సీనియర్ నాయకుడు రఘు గౌడ్,ఖాలీల్, కంది మొగలయ్య, సంగారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కశిని రాజు, రాజంపేట శ్రీను, చిత్తారి యాదగిరి, కౌన్సిలర్లు రాజు గౌడ్, వంశీ, రమేష్, శైలేష్, శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు భూమేశ్, మైనార్టీ అధ్యక్షుడు ఆరిఫ్, కుతూబ్, జహీర్,తహెర్, పెద్ద ఎత్తున రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భానుక నర్మద వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి

సికింద్రాబాద్.. కంటోన్మెంట్ ప్రాంతంలో ఆక్రమణలకు పాల్పడి యధేచ్ఛగా నామినేటెడ్ సభ్యురాలుగా కొనసాగుతున్న భానుక నర్మద వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆ హోదాలో కొనసాగేందుకు ఆమె పూర్తిగా అనర్హురాలని బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ స్పష్టం చేశారు. తాడు బండ్ రత్న కో–ఆపరేటివ్ సొసైటీలో కంటోన్మెంట్ కు కేటాయించిన 40 శాతం భూభాగంలో వారు నిర్మాణం చేశారని, కంటోన్మెంట్ వాళ్లు కూల్చి అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతిసారి కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకొని కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. కంటోన్మెంట్ చట్టం 2006 లోని సెక్షన్ 34 ప్రకారం తక్షణమే కంటోన్మెంట్ బోర్డు సీఈవో, బోర్డు నామినేటెడ్ సభ్యురాలిని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మన్నే క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ... బోర్డు నామినేటెడ్ సభ్యురాలి భర్త భానుక మల్లికార్జున్ కంటోన్మెంట్ భూమిని ఆక్రమించి అతిథి గృహం నిర్మించుకున్న నేపథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు నుండి నోటీసులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భానుక నర్మదకు పదవి కావాలో లేదా తన అతిథి గృహం కావాలో తేల్చుకోవాలన్నారు. భానుక నర్మదా నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆమె నామినేటెడ్ సభ్యురాలుగా కొనసాగడం సిగ్గుచేటని ఆమె రాజీనామా చేసినా లేదా ఆమెను కంటోన్మెంట్ బోర్డు అనర్హురాలిగా ప్రకటించినా ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతంలో పేదలకు ఒకరకంగా భాజపా నాయకులకు మరొక రకంగా న్యాయం ఉండకూడదని వెల్లడించారు.

# అప్రమత్తతతో కుట్రలను చేద్దాం

# – ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం



ఎస్ ఐ ఆర్ పై ఆందోళన వీడి అప్రమత్తంగా వ్యవహరిస్తూ అక్రమంగా ఓట్ల తొలగింపు కుట్రలను చేదిద్దామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బూత్ లెవెల్ ఏజెంట్లు కార్యకర్తలకు సూచించారు. ఎస్ ఐ ఆర్ పై సోమాజిగూడ డివిజన్ లో సమగ్ర శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ ఎన్నో అపోహలు, ఆందోళన నడుమ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పై బూత్ లెవెల్ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న పార్టీకి తొత్తుగా మారడంతో సాధారణ ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తన ఓటు ఉంటుందో పోతుందోనని ప్రతి ఒక్కరూ భయాందోళన గురి కావటం విచిత్రమైన పరిస్థితిని, ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ఎస్ ఐ ఆర్ లో పేరు లేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడడం కలిచి వేసిందని అన్నారు. ఓట్లను పరిరక్షించడం అంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమేనన్న ఉన్నత లక్ష్యంతో ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు.

అందులోకి నన్ను లాగకండి

– దానం

రాష్ట్రంలో కొనసాగుతున్న సవాళ్ల ప్రతి సవాళ్లపై దానం మాట్లాడేందుకు నిరాకరించారు. సవాళ్లు విసిరిన వారు, స్వీకరించిన వారే చెబుతారని అందులోకి తనను లాగొద్దంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## చిట్ ఫండ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

## పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు సూచన



నరసరావుపేట, అధిక లాభాలు, తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు వంటి తప్పుడు హామీలతో చిట్ ఫండ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి కృష్ణారావు సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సంస్థ రిజిస్ట్రేషన్, అనుమతులు తప్పనిసరిగా పరిశీలించాలని, నగదు కాకుండా బ్యాంకు లావాదేవీల ద్వారానే చెల్లింపులు చేయాలని తెలిపారు. మోసంపై అనుమానం వచ్చిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, 112సమాచారం ఇవ్వాలని సూచించారు.

## మాజీ సీఎం కొణిజేటి రోశయ్యకు ఘన నివాళులు



పిడుగురాళ్ల, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 93వ జయంతి సందర్భంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నందు గల రోశయ్య కాంస్య విగ్రహానికి పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనిగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ శ్రీనివాసరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలిగిరి శ్రీనివాసరావు తో పాటు పార్టీ సీనియర్ నాయకులు కొత్త సాంబశివరావు, కుటుంబరావు, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణలో వచ్చేది కేసీఆర్ సర్కార్ పక్కా ఘనపూర్ సంతోష్




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తెలంగాణలో మళ్లీ వచ్చేది కేసీఆర్ సర్కార్ పక్క సారే కావాలంటున్నారు సర్కారె కావాలంటున్నారు తెలంగాణ ప్రజలు అనిఘనపూర్ సర్పంచ్ అభ్యర్థి సంతోష్ తెలిపారు తెలంగాణలో గ్రూప్లో ఉన్న వాళ్ళ ఓట్లే కావాలా కాంగ్రెస్ ప్రభుత్వానికి అందుకే వాళ్లకు చీరలు పంపిణీ చేశారు తెలంగాణ ముద్దుబిడ్డ పెద్ద కొడుకు కేసీఆర్ 18 ఏళ్లు నిండిన ప్రతి ఓటు హక్కు కలిగి ఉన్న డ్వాక్రా గ్రూపులో ఉన్న లేకున్నా ప్రతి ఒక్కరికి బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికి ఉందని వృద్ధాప్యంలో ఉన్న పెద్దలు అమలు జ్ఞాపకం చేశారు అని గణపురం సర్పంచ్ అభ్యర్థి సంతోష్ తెలిపారు

## గోనెగండ్ల వీధికుక్కల దాడి ఘటనపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి

### ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం



గోనెగండ్ల పట్టణంలో ఒక చిన్నారిపై వీధికుక్క దాడి చేసి గాయపరిచిన ఘటనపై ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే క్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి తక్షణమే స్పందించారు. ఘటన వివరాలు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోని నివాస ప్రాంతాలు, ప్రధాన వీధులు, బహిరంగ ప్రదేశాల్లో సంచరిస్తున్న ప్రమాదకరమైన వీధికుక్కలను గుర్తించి, వాటిని పట్టుకుని తరలించేలా వెంటనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ముఖ్యంగా చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వీధికుక్కల నియంత్రణ కోసం అవసరమైన అన్ని చర్యలను వేగవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, కుక్క కాటుకు గురైన చిన్నారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని స్థానిక వైద్య అధికారులను ఆదేశించారు. చికిత్సలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచడంతో పాటు బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రజల భద్రతే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని, ఇలాంటి ఘటనలపై వెంటనే స్పందిస్తూ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.

## సిద్దిపేట కు రేవంత్ రెడ్డి గ్రహణం పట్టింది: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సిద్దిపేట







హరీష్ రావు మాట్లాడుతూ వచ్చేది మన ప్రభుత్వమే సిద్దిపేట అభివృద్ధి వంద కిలోమీటర్ల వేగం తో ప్రగతి పరుగులు పెట్టిస్తామిా అందరి తలరాత మారాలి అంటే కెసిఆర్ అనే గీత పెట్టుకోవాలి. అ గీత నే మిా భవిష్యత్ మారుస్తుందిసిద్దిపేట లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతు. రియల్ ఎస్టేట్ ఒక పెద్ద వ్యాపారం. రియల్ ఎస్టేట్ బాగుంటే దానికి అనుబంధంగా ఎన్నో రంగాలు బాగుంటాయిరియల్ ఎస్టేట్ రంగం బాగా నడిస్తే ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఆదాయం పెరుగుతుందని, అలాగే సిమెంట్, స్టీల్, టైల్స్, శానిటరీ, మార్బుల్స్ వంటి అనేక రంగాలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. వందలాది వ్యాపారాలు సజావుగా సాగుతాయి. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొత్తం వ్యవస్థ కుప్పకూలిపోయింది. మీరందరూ ఇంతకుముందు ఎంత ఉత్సాహంగా ఉండేవారు!కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిపోయిందని, దాని ప్రభావంతో చిన్న వ్యాపారాలు,టీ హోటళ్లు, దుకాణాలు,ఇతర అనుబంధ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయనిఇది ఒక్క సిద్దిపేట పరిస్థితి కాదు. రాష్ట్రం మొత్తం ఇదే పరిస్థితి. హైదరాబాద్లో చూసినా ఇదే, కరీంనగర్లో చూసినా ఇదే,నల్గొండలో చూసినా ఇదే, మహబూబ్నగర్లో చూసినా ఇదే, నిజామాబాద్లో చూసినా ఇదే పరిస్థితి. ఎక్కడ చూసినా వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దుకాణాలు నడవడం లేదు. షాపులకు గిరాకీ లేదు. వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులతో వాహనాల ఈఎంఐలు కూడా చెల్లించలేక, ఫైనాన్స్ సంస్థలు వాహనాలు స్వాధీనం చేసుకుంటున్నారు. కుటుంబాలు పిల్లల ఫీజులు చెల్లించలేక, కొందరు పట్టణాలు వదిలి గ్రామాలకు వెళ్లి వ్యవసాయం చేసుకునే పరిస్థితి వచ్చిందిఅంటే జీవితమే రివర్స్ అయిపోయింది.

## పుల్లంపేట వద్ద రోడ్డు ప్రమాదం



కడప తుఫాన్ వాహనం టైరు పంచరై బోల్తా పడింది. పుల్లంపేట వద్ద ప్రమాదం జరిగింది. ఘటనలో ముగ్గురికీ గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని కర్నూల్ కు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. పుల్లంపేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఒకే ఇంట్లో ముగ్గురు మహిళల బలవన్మరణం

కృష్ణా జిల్లా గూడూరు మండలం, అనంతాయిపేటలో విషాదం నెలకొంఇ. ఒకే ఇంట్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికంగా వుంటున్న రజని (60), కుమార్తె గౌరి (40), కోడలు మధు (35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సమస్యలే కారణంగా స్థానికుఉ భావిస్తున్నారు. గూడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ కేంద్ర ప్రభుత్వం తాజాగా 23 మందిని ఉగ్రవాదులకు ప్రకటించింది. 17 మంది పాకిస్థాన్ జాతీయులను, ఆరుగురు భారతీయులను ఉగ్రవాదులుగా గుర్తించింది. ఈ మేరకు ఉపా చట్టం కింద నోటిఫికేషన్ జారీ చేసింది.

# రహదారులు, అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**అభివృద్ధి పనుల్లో శాఖల సమన్వయంతో ముందుకు సాగాలి**

**రహదారుల నిర్మాణంలో నాణ్యతతో పాటు గడువుకు ప్రాధాన్యం ఇవ్వాలిలి**

**జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి**

**జిల్లాలో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై04 ప్రజాబలం:**జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో చేపట్టిన రహదారులు, వంతెనలు, భవనాలు తదితర అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు.




శనివారం కలెక్టరేట్ మిటింగ్ హాల్ లో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రహదారులు, భవనాల నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.



సీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి నిర్మాణాల్లో ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పనుల అమలులో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఖమ్మం కేబుల్ బ్రిడ్జి ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి పనులు, ముదిగొండ--వల్లభి ఫోర్‌లేన్ రహదారి నిర్మాణ పనులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, నిర్ణీత మెజర్‌మెంట్ ప్రకారం చేపట్టాలని సూచించారు.

బోనకల్--ఆలపాడు రహదారి నిర్మాణంలో సంబంధిత తహసీల్దార్‌కు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించి, అనుమతులు వచ్చిన వెంటనే పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

ఈ నెలలో ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించే అవకాశం ఉన్నందున సంబంధిత అన్ని అభివృద్ధి పనులు, ఏర్పాట్లను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో అధికారులు తమ పరిధిలోని పనుల పురోగతిని వివరించగా, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు.

# 166 కేజీల గంజాయి పట్టివేత.

**ఒడిశా రాష్టం నుంచి హైదరాబాద్ కు గంజాయి అక్రమ రవాణా**

**నిందితుడిని అరెస్ట్ రిమాండ్ కు తరలింపు..**

**వివరాలు వెల్లడించిన సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి.**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై04 ప్రజాబలం:**ఒడిశా రాష్టం నుంచి హైదరాబాద్ కు కారులో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ పర్యవేక్షణలో శుక్రవారం ఈగల్ బృందం, పోలీస్ సిబ్బంది కలిసి సత్తుపల్లిలో నిర్వహించిన వాహన తనిఖీల్లో





అనుమానస్పదంగా
వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 166 కేజీల 360 గ్రాముల గంజాయి ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి నిందితుడైన ప్రబిన్ భాత్రా ను అదుపులోకి తీసుకోని అతని నుంచి ఒక సెల్ ఫోన్, 500 రూపాయల నగదు, ఒక కారు ను సీజ్ చేయడం జరిగిందని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి తెలిపారు.

నిందితుడు ప్రబిన్ భాత్రా, కారు డ్రైవరు గా పని చేస్తాడని, ఒడిశా రాష్టంలో గంజాయిని సరఫరా చేసే బికారి ఏ రోహన్ అనే వ్యక్తి తను తన వద్ద వున్న (80) గంజాయి ప్యాకెట్లను కారులో తీసుకెళ్ళి హైదరాబాదులో తాను చెప్పిన వ్యక్తికి అందచేసిరావాలని, అందుకు గాను 10,000/- రూపాయలు ఇస్తానని చెప్పి ఞా-39-ఞు-8240 గల కారు డీక్కీలో (6) ప్లాస్టిక్ సంచులు అందులో వున్న (80) బ్రౌన్ టేప్ చుట్టబడిన గంజాయి ప్యాకెట్లను ఇవ్వగా జులై 3 న తెల్లవారుజామున దారకొండ జంక్షన్ నుండి బయలుదేరి రాజమండ్రి వచ్చి అక్కడ నుండి గ్రీన్ ఫీల్డ్ హైవే లో వస్తూ..ఇకముందు పోలీస్ తనిఖీలు వుంటాయని, వేంసూర్ వద్ద హైవే దిగి సత్తుపల్లిలో భోజనం చేసి సత్తుపల్లి మీదుగా హైదరాబాదు వెళ్దామని అనుకోని హైవే దిగి సత్తుపల్లి వస్తుండగా సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు.

నిందితుడిపై ఎన్ డి పి ఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా శనివారం ప్రబిన్ భాత్రా ను రిమాండ్ కి తరలించి పరారీలో మిగతా నిందితుల కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం కేసు పరిశోధనలో వున్నదని తెలిపారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గంజాయి నిరోధక చట్టం లో భాగంగా ఎవరైనా వ్యక్తులు గంజాయి కొన్నా కానీ అమ్మినా కాని గంజాయి వినియోగించిన వారిపై పిడి కేసులను నమోదు చేయడం జరుగుతుందని అన్నారు.

గంజాయి రవాణా, నిల్వలపై సమాచారం ఇస్తే తగిన ఇస్తామని అదేవిదంగా వారి వివరాలు పేర్లు గోప్యం వుంటుందని పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఎస్సై వీర ప్రసాద్, ఎస్సై ప్రదీప్, ఈగల్ టీం సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులు :-

ఏ-1: ప్రబిన్ భాత్రా 31 సం,, గుంతవాడ, దొరగుడా, మల్కాన్ గిరి జిల్లా, ఒడిశా రాష్టం.

ఏ-2: బికారి ఏ రోహన్ ఒడిశా రాష్టం

ఏ-3: చుక్క నాగేశ్వరరావు గౌడ్, బేతంచర్ల, నద్యాల, కర్నూల్ జిల్లా

సీజ్ చేసినవి:

1) (80) ప్యాకెట్ల లో వున్న గంజాయి బరువు 166 కేజీల 360 గ్రాములు, దాని విలువ 89,13,.000/- రూపాయలు.

2) టయోటా ఇతిహాస్ కారు

3) ఒక ఫోన్,

4) 500/- రూపాయలు నగదు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి...

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్ లకు సూచించారు,అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్ని ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలను జిల్లాల్లో విజయవంతంగా అమలు చేయాలని సూచించారు,శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయం,విత్తనాలు, ఎరువుల లభ్యత, ప్రజారోగ్యం,పంటల వైవిధ్యీకరణ,ఫార్మర్ రిజిస్ట్రీ, తాగునీటి సరఫరా ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు,ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ,జిల్లాల వారీగా వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా రైతులను ఆయా పంటల సాగుకు ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు.రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు,యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, అక్రమ నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే నానో యూరియా



వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు,రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని పేర్కొంటూ, అర్హులైన ప్రతి రైతు నమోదు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు,పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి పథకాల అమలును వేగవంతం చేయాలని సూచించారు,వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి నాణ్యత, పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు,మధ్యాహ్న భోజన పథకం అమలును మరింత మెరుగుపరిచేందుకు జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ,జిల్లాలో విత్తనాలు, ఎరువులకు ఎలాంటి కొరత లేదని, రైతులకు అవసరమైన అన్ని వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ప్రభుత్వం ప్రతిపాదించిన సన్నరకం వరి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నామని వివరించారు,ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తూ వంద శాతం నమోదు పూర్తి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు,తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని,సింగూర్ ప్రాజెక్ట్ మరమ్మత్తులు జరుగుతున్నాయని, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు జోగిపేటలో స్థలాన్ని గుర్తించామని తెలిపారు,డెంగ్యూ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నామని తెలిపారు,ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుండి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్,వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన దొడ్డి కొమరయ్య

## దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడని, ఆయన త్యాగం, ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# ప్రభుత్వ పథకాలు ప్రజలకుఅందించడమే మా లక్ష్యం అగ్రికల్చర్ ఏఈఓ సంగీత



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జులై 4 (ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ రైతు వేదికలో రైతుల గురించి అహర్నిశలు ఆలోచిస్తూ కష్టపడి పనిచేస్తున్న అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారు ప్రజలకు రైతుబంధు పడ్డవారు రైతుబంధు పడినవారు లిస్ట్ ఒకటి చేయడం పడని వారికి ఫోన్ చేసి వివరాల సేకరించి తిరిగి ప్రభుత్వానికి మళ్లీ పంపించడం కొత్తగా భూములు కొనుగోలు చేసినటువంటి వారు వెంటనే అకౌంటు నెంబరు పాస్ బుక్ తో అగ్రికల్చర్ ఆఫీసులో అనగా రైతు వేదికలో నమోదు చేయించుకోవాలని ఎప్పటికప్పుడు గ్రామా ప్రజల సమస్యలను పాయింట్ అవుట్ చేస్తూ సమస్యగా ఉన్న పేర్లుడివైడ్ చేస్తూ గ్రామాల్లో రైతులకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు వారి కున్నటువంటి గ్రామాలు కాకుండా ఇతర గ్రామాలు కూడా ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించి పూర్తిస్థాయిలో రైతుల పక్షాన కష్టపడి అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారు విధులు నిర్వహిస్తున్నారని రైతులు సంతోషం వ్యక్తపరిచారు


# ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే రాగమయి.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి జూలై 04 ప్రజాబలం:** వేంసూరు మండలం రాయుడు పాలెం గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్ లు ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్.

రాయుడు పాలెం గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ గా వడ్లమూడి నరసింహ రావు 5 గురు కమిటీ సభ్యులు రాయుడు పాలెం గ్రామం లో బెండాలపాడు వీరన్న వీరభద్రుడు గుడి చైర్మన్ గా కాకాని శ్రీనివాస్ రావు 5 కమిటీ సభ్యులు కు శుభాకాంక్షలు తెలియజేసి, పూజా కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ సోమిరెడ్డి, వేంసూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, రాయుడు పాలెం సర్పంచ్, నాయకులు మేడా వెంకటేశ్వర రావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, వేంసూరు మండలం కాంగ్రెస్ నాయకులు, మండలం ,కార్యకర్తలు, భక్తులు ప్రజలు, మహిళా, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# పేదలకు కొండంత అండ సీఎంఆర్ఎఫ్ - పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ జి. శుక్లవర్ధన్ రెడ్డి



**జహీరాబాద్, జూలై 4 ప్రజాబలం ప్రతినిధి:** అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ జి. శుక్లవర్ధన్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్ నాయకత్వం, ప్రత్యేక సహకారంతో శనివారం నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా శుక్లవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తీవ్ర అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం సకాలంలో ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పౌరుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందేలా చూడటమే తమ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ దిశానిర్దేశంలో నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.

?ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం నుంచి సకాలంలో చెక్కులు అందడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. తమకు అండగా నిలిచిన ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌కు, ఇన్‌ఛార్జ్ శుక్లవర్ధన్ రెడ్డికి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శివాలయంలో సహస్రఘటాభిషేకం

## ఘనంగా వార్షికోత్సవ పూజలు
## జంపన్నవాగు నీటితో అభిషేకాలు
## అన్నదాన కార్యక్రమం

**ఏటూరునాగారం: డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 04** ములుగు జిల్లాఏటూరు నాగారం మండల కేంద్రంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం వార్షికోత్సవ పూజలను అర్చకులు రాజ్‌కుమార్‌ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ద్వజస్థంభం, అభివృద్ధి పనులు చేపట్టి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం శివలింగానికి పంచామృత అభిషేకాలు, 10 గంటలకు సమీపంలోని జంపన్నవాగు నుంచి కుండలు, రాగి పాత్రలతో నీటిని తీసుకువచ్చి సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం శివలింగాన్ని అన్నపూర్ణేశ్వరిగా అలంకరించి పలు రకాల పుష్పాలతో పుష్పార్చన, ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని శివలింగాన్ని నీటితో అభిషేకం చేశారు. అనంతరం ఆలయం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దేవులపల్లి విజయ్‌కుమార్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా 3వేల మంది భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మడుగూరి ప్రసాద్, రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, డైరెక్టర్లు ఇర్సవడ్ల కిరణ్, సోమందరపు నర్సింహులు, వల్స తిరుపతి, కర్ల అరుణ, కట్కూరి రాధిక, దుర్గం కొమురయ్య, అనిల్, వేణుగోపాల్ లాహోటి, బండి రాము, రాంలాల్, కత్తెర శ్రీనివాస్, మంచాల పవన్, చెన్న రాంబాబు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయ అభివృద్ధికి 1,41,000/- విరాళం



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -04** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనుల కొరకై శనివారం రోజున వరంగల్ కి చెందిన జాట్లింగ్ కిరణ్ కుమార్ - లక్ష్మీ లావణ్య దంపతులు స్వామివారి ఆలయానికి 1,41,000/- రూపాయల నగదును ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎల్ రమాదేవికి అందజేశారు. ఆలయ అధికారులు వారి దంపతులకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనం అందించి లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షలు జి. శ్రీనివాస్ శర్మ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పంట మార్పిడి, ఆయిల్ పామ్ పంటల సాగును ప్రోత్సహించాలి.

## కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగు చర్యలు తీసుకోవాలి.
## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జులై 04 2026 ములుగుశనివారం, హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2026 - 27 సంవత్సరానికి 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలలో అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. పంట మార్పిడి విధానాలను అవలంబించాలన్నారు. కూరగాయల సాగు వైపు దృష్టి సారించాలని వివరించారు. సూక్ష్మ సేద్య పద్ధతులు రైతులు పాటించేలా వారిని ప్రోత్సహించాలని తెలిపారు.



యూరియా, డిఎపి, ఇతర కాంప్లెక్స్ ఎరువులన్నీ రైతులకు సరిపడినన్ని అందించాలన్నారు.

ఎరువులను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల కలెక్టర్లు స్వయంగా ఈ అంశంపై పటిష్ట నిఘా ఉంచాలని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షిస్తూ, దేశంలోనే ఫార్మర్ రిజిస్ట్రీలో తెలంగాణ రాష్ట్రం 71.45 శాతంతో మొదటి స్థానంలో ఉందన్నారు.

వర్షాకాలం కాలానుగుణ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఎం హెచ్ ఓ గోపాల్ రావు, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఇరిగేషన్ ఈ ఈ అప్పలనాయుడు, మిషన్ భగీరథ డి ఈ సునీత సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## రైతుభరోసా నిధుల జమపై సీఎం రేవంత్, మంత్రులు సీతక్క తుమ్మలకు పాలాభిషేకంతో చేసిన కాంగ్రెస్ నాయకులు

**ఏటూరు నాగారం, డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూలై 4** తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ రైతుల ఖాతాల్లో



రైతుభరోసా నిధులను జమ చేయడంపై ఏటూరు నాగారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.పంచాయతీరాజ్ ఆ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ డాక్టర్ సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏటూరు నాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవులపల్లి విజయ్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతుభరోసా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తోందని, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతుల్లో నూతన విశ్వాసాన్ని నింపుతున్నాయని అన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పాలనకు నిదర్శనమని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, ములుగు ఆత్మ చైర్మన్ చిటమట రఘు, ఏటూరు నాగారం ఆత్మ చైర్మన్ కర్ల అరుణ, ఆర్టీసీ డైరెక్టర్ వసంత శ్రీనివాస్, శివాలయం చైర్మన్ మడుగురి ప్రసాద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, సర్పంచ్ గద్దల నవీన్, వావిలాల చిన్న ఎల్లయ్య. సర్వ అక్షిత్. ఠాగూర్. తాజ్. నరసింహ రావు
సరికోపుల శ్రీనివాస్.గంపల శివ. పడిదల హనుమంత్.లక్కీ.తరుణ్.రమేష్. సిరాజ్. ఖలీల్ ఖాన్ . సాంబశివరావు.గికురు భాగ్య. రాధిక. ఉదయ్ మంజుల.జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు ప్రత్యేక సవరణలో బాధ్యతగా పాల్గొనాలి



**జహీరాబాద్, జూన్ 4 ప్రజాబలం ప్రతినిధి:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలు బాధ్యతగా పాల్గొని ఓటరు వివరాలను సరిచేసుకోవాలని బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ కోరారు. ప్రతి 20 ఏళ్లకోసారి నిర్వహించే ఈ ప్రక్షాళన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డబుల్ ఓట్లు తొలగించడం, వలస ఓటర్ల వివరాలను సరిచేయడం, అర్హులైన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవడం అవసరమని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత బీఎల్‌వోలు లేదా రాజకీయ పార్టీల బీఎల్ఏలను సంప్రదించాలని సూచించారు. బీఆర్ఎస్ బూత్ ఇన్‌చార్జులు, బీఎల్ఏలు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్ కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని ఆయన కోరారు.

# చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలి

## సీనియర్ సివిల్ జడ్జి జి. కవితాదేవి




**జహీరాబాద్, జూలై 4 ప్రజా బలం ప్రతినిధి:**ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకుని, చదువుతో పాటు సమాజంలో సాధారణ చట్టాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జి. కవితాదేవి సూచించారు. శనివారం స్థానిక రావ్స్ ఇంటర్నేషనల్ ఉన్నత పాఠశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' అంశాలపై ప్రత్యేకంగా వివరించారు. మోటార్ వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం, బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ మోసాలు, ఉచిత న్యాయసేవా సహాయం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మీ పరిసరాల్లో ఎక్కడైనా బాల కార్మికులు, బాల్య వివాహాల బాధితులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నేరుగా గానీ.. లేదా 1098, 100 నెంబర్లకు ఫోన్ ద్వారా గానీ సమాచారం అందించాలని జడ్జి కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. న్యాయపరమైన ఎలాంటి సందేహాలున్నా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.



?ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాస్ కన్నా, సోమశేఖర్, విశ్వనాథ్, రాఘవేంద్ర నాయక్, ఇస్మాయిలప్ప, అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

# ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

## మల్లంపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి,ఆర్‌డీఓ కృష్ణవేణి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూలై 04 మల్లంపల్లి**శనివారం మల్లంపల్లి మండల కేంద్రం లోని, గౌస్‌పల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో కృష్ణవేణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా బీఎల్ఓ యాప్‌లో నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు.

ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలీకరణను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి ఫారంలో నమోదు చేసే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితత్వంతో బీఎల్ఓ యాప్‌లో నమోదు చేయాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు.

ఈ తనిఖీలో సంబంధిత ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.




# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య...



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని సండే మార్కెట్ వద్ద ఉన్న దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు,అనంతరం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు,సామాజిక న్యాయం,ఆత్మగౌరవం, అణచివేతకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు,ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి,డాక్టర్ శ్రీహరి,పుష్ప నగేష్, లాడే మల్లేశం,లాడే బాలు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొని దొడ్డి కొమురయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# కన్న కొడుకును కడతేర్చిన కసాయి తండ్రి.....



ఖమ్మం జిల్లా కల్లూరు లో జరిగిన సంఘటన. స్థానికుల వివరాలు ప్రకారం.... పట్టణంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన కొత్తపల్లి సీతారాములు ఆటో డ్రైవర్... శుక్రవారం రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో మద్యం మత్తులో తన ఒక్కగానొక్క కుమారుడు కొత్తపల్లి కిరణ్ కుమార్(30) ను దగ్గరలోని బెల్ట్ షాపుకు తీసుకువెల్లి ఫుల్లుగా మద్యం తాగించి తిరిగి తన ఇంటికి తీసుకొచ్చి విసక్షణారహితంగా కొట్టి, తల వెనక భాగంపై బలమైన గాయం చేయడంతో విపరీతమైన రక్తస్రావంతో కిరణ్ కుమార్ కుప్పకూలిపోయాడు. కిరణ్ చనిపోయాడని నిర్ధారించుకున్న తండ్రి సీతారాములు తన ఆటోలో పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి హంతకుడిని గాలిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ముత్తులింగం, ఎస్సై హరిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.



# ఆయిల్‌పామ్‌తో రైతులకు స్థిరమైన ఆదాయం

## -జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు



**జహీరాబాద్ జులై 4 ప్రజాబలం ప్రతినిధి :** కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన పంట అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, 2026--27 సంవత్సరానికి జిల్లాలో 3,000 ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన మొక్కలు, సబ్సిడీలు, సాంకేతిక మార్గదర్శకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల ఆయిల్‌పామ్ తాజా పండ్ల గెలల కొనుగోలు ధరను టన్నుకు రూ.23,700కు పెంచడం రైతులకు మరింత ప్రయోజనకరంగా మారిందన్నారు. ప్రతి రైతు ఆయిల్‌పామ్ సాగు వైపు ఆసక్తి చూపి, అధిక విస్తీర్ణంలో సాగు చేపట్టాలని పిలుపునిచ్చారు.

అనంతరం గ్రామానికి చెందిన రైతు జయసింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు.




కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, ఉద్యాన అధికారి సునీత, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, ఉద్యాన శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కురుమ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి



**వేములవాడ( ప్రజాబలం ప్రతినిధి జూలై – 04)** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78 వర్ధంతి సందర్భంగా శనివారం రోజున కురుమ కులస్తులు వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రోడ్డు చౌరస్తా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ముందుండి నడిపించిన మొదటి అమరవీరుడు అని ఆయన త్యాగం వేలాది మంది రైతులకు స్ఫూర్తినిచ్చిందని తెలంగాణ చరిత్రలో ఒక కీలక మలుపు రాయిగా నిలిచాడని ఆయన జీవితం తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, సమానత్వం, రైతు హక్కుల కోసం జరిగిన పోరాటానికి చిరస్థాయిగా నిలిచిన స్ఫూర్తిదాయక గాదా అని వారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు జక్కుల తిరుపతి, పట్టణ కురుమ సంఘం అధ్యక్షులు గుంటి కనుకయ్య, జిల్లా కోశాధికారి ఒల్లెం నాగరాజు, కురుమ సంఘం కులస్తులు పర్షరాములు, మల్లేశం, బుగ్గయ్య, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# త్రిబుల్ ఐటి (ఐఐఐటి)లో విద్యార్థి ఆత్మహత్య

గచ్చిబౌలి త్రిబుల్ ఐటిలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అనిరూధ్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు గత కొంత కాలంగా అనారోగ్య మరియు కుటుంబ సమస్యల వల్ల బాధపడుతున్నట్లు సమాచారం. తాను ఉంటున్న బిల్డింగ్ 6వ అంతస్తూ పై నుండి దూకి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. గచ్చిబౌలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడు ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి గా గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీనివాస చారి మరణం బీఆర్ఎస్ పార్టీకి,సంగారెడ్డి పట్టణానికి తీరని లోటు :ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 4 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/బీఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి పట్టణ మాజీ అధ్యక్షులు శ్రీనివాస చారి శనివారం నాడు ఉదయం స్వర్గస్తులయ్యారు,ఈ విషాద వార్త తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెంటనే సంగారెడ్డి పట్టణంలోని 35వ వార్డు, సాయిబాబా కామన్, పాత ఇంటి వద్దకు చేరుకుని శ్రీనివాస చారి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు,అనంతరం దుఃఖ సంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస చారి పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు చేసిన కృషిని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్మరించుకున్నారు,పార్టీ పట్ల ఆయన చూపిన అంకితభావం,నిబద్ధత, కార్యకర్తలతో ఆయనకు ఉన్న అనుబంధం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి,సంగారెడ్డి పట్టణానికి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు,ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి,విజేందర్ రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి,మాజీ కౌన్సిలర్ జీవీ శ్రీనివాస్, చేర్యాల ప్రభాకర్,కొండల్ రెడ్డి,బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి పీ. నర్సింలు,కౌన్సిలర్ జలేందర్,శ్రవణ్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని శ్రీనివాస చారికి నివాళులర్పించారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకుఅందించడమే మా లక్ష్యం అగ్రికల్చర్ ఏఈఓ సంగీత



**వికర్మ నియోజకవర్గ ప్రతినిధి జులై 4 (ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ రైతు వేదికలో రైతుల గురించి అహర్నిశలు ఆలోచిస్తూ కష్టపడి పనిచేస్తున్న అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారు ప్రజలకు రైతుబంధు పడ్డవారు రైతుబంధు పడినవారు లిస్ట్ ఒకటి చేయడం పడని వారికి ఫోన్ చేసి వివరాల సేకరించి తిరిగి ప్రభుత్వానికి మళ్లీ పంపించడం కొత్తగా భూములు కొనుగోలు చేసినటువంటి వారు వెంటనే అకౌంటు నెంబరు పాస్ బుక్ తో అగ్రికల్చర్ ఆఫీసులో అనగా రైతు వేదికలో నమోదు చేయించుకోవాలని ఎప్పటికప్పుడు గ్రామా ప్రజల సమస్యలను పాయింట్ అవుట్ చేస్తూ సమస్యగా ఉన్న పేర్లుడివైడ్ చేస్తూ గ్రామాల్లో రైతులకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమని తెలిపారు వారి కున్నటువంటి గ్రామాలు కాకుండా ఇతర గ్రామాలు కూడా ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించి పూర్తిస్థాయిలో రైతుల పక్షాన కష్టపడి అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారు విధులు నిర్వహిస్తున్నారని రైతులు సంతోషం వ్యక్తపరిచారు

## కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ



**జహీరాబాద్, జూలై 4 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి జానకి రెడ్డి శనివారం హోతీ(కె)లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వంటశాల, స్టోర్‌రూమ్, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని మెనూ ప్రకారం అందించాలని, వంటశాల, పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.తనిఖీలో ఎంపీడీవో మహేందర్ రెడ్డి, ఎంఈవో మానయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత మాటున అక్రమ వ్యాపారం

### పతలేని ప్లాస్టిక్ నిషేధం....
### మనిషి జీవితంలో భాగమైన ప్లాస్టిక్...
### ప్రజల్లో కొరవడిన చైతన్యం...
### యదేచ్చగా కొనసాగుతున్న వాడకం...
### తూతు మంత్ర దాడులతో సరిపెడుతున్న అధికారులు





**చంద్రుగొండ జూన్ 4 ప్రజాబలం ప్రతినిధి** :- పర్యావరణానికి పెనుభూతంగా మరి నా ప్లాస్టిక్ భూతాశీ పై నియంత్రణ కోరవడింది. యదేచ్ఛగా విక్రయలు... విచ్చలవిడిగా వినియోగం జరుగుతుంది. అవగాహన రహిత్యముతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను మురికి కాలువలో పడి వేస్తున్నారు. దీంతో నీరు వెళ్లక ఎక్కడికి అక్కడ నిల్వ ఉండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. స్వచ్ఛభారత్,స్వచ్ఛ తెలంగాణ ప్లాస్టిక్ వ్యర్థాలే నిరోధకాలుగా మారాయి.అధికారులు మాత్రం మొక్కుబడిగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు.

నిబంధనలు గాలికి

100 మైక్రోన్లు కంటే ఎక్కువ ఉండే ప్లాస్టిక్ ని వినియోగించాలని కేంద్ర పర్యావరణ అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 100 లోపు మైక్రాన్ కలిగి ఉన్న ప్లాస్టిక్ ని ఉత్పత్తి చేయడం, విక్రయించడం వాడడం నేరం. ప్లాస్టిక్ వస్తువులను తయారు చేసే సంస్థలు పేరు,చిరునామా,పరిమాణం, తప్పనిసరిగా ముద్రయించాలి. నిబంధనలు ఉల్లంఘించడం ఉత్పత్తి సంస్థకు లక్ష రూపాయలు జరిమానా విధించడంతో పాటు ఐదు సంవత్సరాలు జైలు ఉంటుంది. గతంలో ఇలాంటివి పంచాయతీ పాలకవర్గంలో జిల్లాలో అన్ని పట్టణ,పల్లెల లో విస్తృతంగా ప్రచారం చేశారు. మొదట్లో అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రాల నుండి గ్రామీణ ప్రాంతాల వరకు హోల్సేల్ గా బైకులపై ఆటోలపై వచ్చి విక్రయించి వెళు న్నారు. అధికారుల కళ్ళ ముందే షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న పట్టించుకునే స్థితిలో అధికారులు లేరు. సంవత్సరానికి జిల్లా స్థాయి నుండి మండల గ్రామాల స్థాయి వరకు కోట్లల్లో బిజినెస్ నడుస్తున్న అధికారుల కు కనీసం చీమకుట్టినట్లైనా కూడా లేదు.

ప్రజల ఆరోగ్యం వాయు కాలుష్యానికి మొదటి కారణం

1.100 మైక్రాములు కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్షన్ ఉత్తరాలు ఉన్న ఎక్కడ అమలు కావడం లేదు.

2.అతి తక్కువ మందం పల్చగా ఉండే ప్లాస్టిక్ వస్తువులు అంత త్వరగా భూమిలో పోవని ఇది పూర్తిగా భూమిలో కరిగి పోవాలంటే వందల సంవత్సరాల పడుతుందని పరిశోధనలో తేలింది.

3.నిషేధ ప్లాస్టిక్ నిప్పి పెడితే దాని నుంచి వచ్చే పొగ వాయు కాలుష్యానికి మొదటి కారణమవుతుంది.

4. షేర్డో రసాయనన్నుంచి వీటిని తయారు చేయడంతో ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదకరమైన వీటిలో ఉన్నట్లు అధ్యయాలు చెబుతున్నాయి. కానీ అధికారులు నియంత్రించడంలో విఫలమయ్యారు. 5. ప్లాస్టిక్ వేద్దాలు పశువుల తిని మృత్యువాత పాడుతున్నాయి. జిల్లా,మండలాల్లో ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి.

6. ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్యాలు ఎన్నో ఉన్నా షాపులు వాళ్ళు తక్కువ రేటుకు వస్తున్నాయని వీటినే విక్రయిస్తూ వాడుతున్నారు.

నిషేధిత వస్తువులు

ప్లాస్టిక్ ప్లేట్లు,గ్లాసులో, స్పూన్లు, ప్లాస్టిక్ కప్స్, స్ట్రాలు, స్వీట్ బాక్సు, ఫుడ్ ప్యాకింగ్ కవర్, ప్లాస్టిక్ గ్రిల్స్, ప్లాస్టిక్ జెండాలు,లాలీపాప్స్, చాక్లెట్స్కవర్స్, ప్లాస్టర్స్, ధర్మకోల్ 100 లోపు మెక్రానల్ లోపు పివిసి బ్యానర్లు, ప్లాస్టిక్ ఇన్విటేషన్ కార్డ్స్ ఇవన్నీ నిషేధ జాబితాలోనే ఉన్నాయి..

ప్లాస్టిక్ కవర్లు తిని మృత్యువాత పడుతున్న మూగజీవాలు..

ప్రజలు ఎడాపెడా వినియోగిస్తున్న ప్లాస్టిక్ కవర్లను రోడ్డుపై పడేయడంతో ఆవులు, గేదలు, వాటిని ఆహారంగా తీసుకుని మృత్యువాత పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజలు ప్లాస్టిక్ కవర్లో తినుబండారాలు పండ్లు ఇతర ఆహార పదార్థాలతో రోడ్లపై పడేస్తుండడంతో పశు గ్రాసం దొరకని స్థితిలో పశువులు ఆ ప్లాస్టిక్ కవర్లు తింటున్నాయి. ఈ ప్లాస్టిక్ కడుపులోకి వెళ్ళిన తర్వాత విషం గా మారి శరీరమంతా వ్యాపించి అపరస్మారక స్థితి లో వెళ్లి వారం పది రోజుల్లో మరణిస్తున్నాయి. గతంలో చంద్రుగొండ ప్రధాన సెంటర్లో ఒక ఆవు రోడ్డుపై పడి తీవ్ర అవస్థ పడుతున్న సమయంలో స్థానికులు గుర్తించి ఆవు ను వెటర్నరీ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించి కడుపులో ఉన్న ప్లాస్టిక్ ని చూసి ఆశ్చర్యపోయారు. కొన్ని ఆవులు, గేదలు కూడా చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ మూగ జీవల కడుపులోకి వెళ్లిన ప్లాస్టిక్ అరగకుండా కనితిలా మారి క్రమంగా శరీరమంతా విషయమై ముత్యువాత పడుతున్నట్లు పశువైద్య పరీక్షల్లో వెల్లడైంది.

## గురుకుల బాలికల కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్



**వేములవాడ ప్రజాబలం ప్రతినిధి జూలై -04** వేములవాడ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఆర్జేసీసీఈటీ ( ఆర్ జె సి సి ఈ టి) ప్రవేశాల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 6న జిల్లా స్థాయిలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీ. జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని సీటు పొందని విద్యార్థినులు, అలాగే ఇప్పటివరకు దరఖాస్తు చేయని అర్హులైన విద్యార్థినులు సిరిసిల్ల బద్దెనపల్లి బాలికల జూనియర్ కళాశాల నందు జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినులు తమ ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తదితర అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పీ. జ్యోతి కోరారు.

## మర్పల్లి సయ్యద్ పటేల్ జాతరలో డ్యాన్స్ ఇరగదీసి దుమ్ములేపిన నీలి శ్రీకాంత్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూలై 4 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి సయ్యద్ పటేల్ జాతరలో షేర్ బ్యాండ్ ముందు డాన్స్ ఇరగదీస్తూ దుమ్ము లేపిన ప్రముఖ వ్యాపారవేత యువ నాయకుడు నీలి శ్రీకాంత్ సయ్యద్ పటేల్ జాతరలో చిన్నలు పెద్దలు యవ్వనస్తులు ప్రతి ఒక్కరు సంతోషంగా ఆనందంగా మైమరిచిపోయి సయ్యద్ పటేల్ జాతర సంబరాల్లో పాల్గొన్నారు అనినీలి శ్రీకాంత్ తెలిపారు సయ్యద్ పటేల్ కమిటీ పెద్దలు ఎంతో సహనంగా ఓపికతో సయ్యద్ పటేల్ను సందర్శిస్తున్న భక్తుల అందరికీ కొబ్బెర చక్కర ఇస్తూ సయ్యద్ పటేల్ ఆశీర్వాదమును వారీ నోటా శుభ పదములు పలుకుతూ సయ్యద్ పటేల్ జాతర పండగ అంగరంగ వైభవంగా జరిగినట్టు తెలిపారునీలి మేఘాలలో తేలిపోతున్నట్టు విన్యాసాలు నృత్యాలు ఒంటెలచేత గుర్రాల చేత విన్యాసాలు చేస్తూ ప్రజల్ని ఎంతో ఆకట్టుకుంటూ సయ్యద్ పటేల్ జాతర పండుగ ఆకాశమంత ఎత్తు సంతోషంతో వేలాది ప్రజల సందడితో సయ్యద్ పటేల్ జాతర పెద్దల సమక్షంలో జరగడం చాలా సంతోషంగా ఉందని యువ నాయకుడు నీలి శ్రీకాంత్ తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com